ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
అక్టోబర్ 26, 2014

రీల్... రియాల్టీ!

మైనపు బొమ్మలు

లండన్‌లోని మేడమ్ టుసాడ్స్ వేక్స్ మ్యూజియమ్‌లో కొలువు తీరాలని కోరుకోని ప్రముఖులు వుండరేమో! ఇప్పుడా ఛాన్స్ కత్రీనా కొట్టేసింది. ఇప్పటికే అక్కడ అమితాబ్ బచ్చన్, హృతిక్ రోషన్, సల్మాన్ ఖాన్, షారూక్ ఖాన్, మాధురీ దీక్షిత్, ఐశ్వర్యా రాయ్, కరీనా కపూర్ వంటి బాలీవుడ్ తారల మైనపు బొమ్మలు కొలువు తీరాయి. వాటి సరసన కత్రీనా బొమ్మనూ పెట్టనున్నారు టుస్సాడ్స్ మ్యూజియమ్ వారు. ఈ బొమ్మల్లో జీవం వుట్టిపడుతుంటుంది. ఎంతగా అంటే.. నిజమైన తారలకు, బొమ్మలకు తేడా కనిపెట్టలేనంతగా. బాలీవుడ్డే కాదండోయ్! హాలీవుడ్‌తో సహా అన్ని రకాల సినీ, రాజకీయ, సాంస్కృతిక రంగాలకు చెందిన ప్రపంచ ప్రముఖులెందరివో బొమ్మలు వున్నాయక్కడ.

కత్రీనా కైఫ్ మైనపు బొమ్మ కోసం ... ఆమె నటించిన 'రాజనీతి' చిత్రాన్ని కానీ... 'షీలా కి జవానీ, చిక్నీ చమేలీ' పాటలను కానీ పరిశీలిస్తున్నారు. 'రాజనీతి' చిత్రాన్ని ఎంచుకుంటే కనుక చీరలో... 'షీలా, చమేలీ'లను ఎంచుకుంటే మాత్రం హాట్ గెటప్‌లో కనిపిస్తుంది మన క్యాట్. చూ..ద్దాం..!

¤



ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

పొదుపు పందిరి

పొదుపు గురించి పొదుపుగా మాట్లాడాలంటే పొదుపరులకు కోపం రావచ్చు. పొదుపు మీదే ప్రపంచం నడుస్తోందన్నది వీరి గాఢ్ఠ నమ్మకం మరి. 'అంత ప్రాధాన్యతే లేకపోతే పొదుపుకు ఓ రోజును కేటాయిస్తారా చెప్పండి?' అని అడిగేస్తారు. అంతటితో శాంతించక...అవకాశం దొరికిందని... గంటల తరబడి పొదుపు పాఠాలు చెప్పేస్తారు. ఇక్కడ వాళ్లకు పొదుపేమీ ఉండదు.

నిజానికి 'పొదుపు బోధ' ... బుడి బుడి అడుగుల వయసులోనే ప్రారంభమౌతుంది. ముంత రూపంలో. ఆ బోధలు...గీతలు దఫదఫాలుగా... స్థాయిలవారీగా .... సాగుతూనే వుంటాయి. డైలీ సీరియల్ లాగా.

పత్రికల్లో, టీవీల్లో పొదుపు గురించి ఎన్నెసి కథనాలు వస్తుంటాయనీ! కార్టూన్లు, జోకులు, వ్యంగ్య రచనలు సరేసరి. 'అలా పొదుపు చేయండి... ఇలా పొదుపు చేయండి' అని ఒకటే'మని' చిట్కాలు చెప్పిస్తుంటారు నిష్ణాతులతో. వీర పొదుపు శిఖామణులు కొందరు ఏకంగా ఉద్గ్రంథాలే రాసేస్తుంటారనుకోండి.

వాణిజ్య ప్రకటనలు పూర్తిగా పొదుపు సూత్రాన్నే పఠిస్తుంటాయి. కాకపోతే... సదరు వస్తువు కొన్నాక తెలుస్తుంది. అది పొదుపు కాదు! పరమ దండగ వ్యవహారమని!!

గృహిణులే కాదు. ఈ మధ్య బడా పత్రికలు సైతం పొదుపు మంత్రను జపిస్తున్నాయి. ఎప్పుడు పండగొస్తుందా పత్రికకు సెలవు ఎప్పుడిద్దామా అని ఎదురు చూస్తున్నాయి. మరి ఆ రోజు పత్రిక ముద్రణకు అయ్యే ఖర్చు మిగులుతుంది కదా. ఇలాంటి పొదుపు సూత్రాలు పెద్ద పత్రికల దగ్గర చాలానే వున్నాయి.

అన్నట్టు ఈ మధ్య సినీ నిర్మాతలు కూడా పొదుపు పాటిస్తున్నారు! అది హీరోలకు ఇచ్చే పారితోషికంలో పాటించినా కాస్తన్నా ప్రయోజనం వుంటుంది.

కాకపోతే హీరోయిన్లకు వాడే దుస్తుల విషయంలో పొదుపు పాటించడంతో... పాపం హీరోయిన్లకూ... వ్యాంపులకూ తేడా లేకుండా పోతోంది.

రాజకీయ నాయకులు వున్నారు చూశారూ! వీరి మాటల్లో పొదుపే వుండదు. ఆ నోటికి హద్దే వుండదు. ఎటైనా.. ఏదైనా...ఏమైనా...మాట్లాడేస్తారు. మరీ ఎన్నికల సమయంలో ఉదారంగా హామీలిచ్చేస్తారు. తీరా గద్దెనెక్కాక... వీర పొదుపు పాటిస్తారు. 'హామీలు నెరవేర్చండి ప్రభో!' అని ఎన్ని రకాలుగా ప్రాధేయపడినా... నోరు మెదిపితే ఒట్టు. ఇది చాలదన్నట్టు... పొదుపు పేర... పేదలకు అంతో ఇంతో ఉపయోగపడే పథకాలను ఎత్తిపడేస్తుంటారు.

నేతలకు... ఎక్కడ నెగ్గాలో మాత్రమే తెలిస్తే చాలదు. ఎక్కడ తగ్గాలో (పొదుపు చేయాలో) కూడా తెలియాలి. కోటీశ్వరులకు, కార్పొరేట్లకు పన్ను రాయితీలు ఇవ్వడంలో, సబ్సిడీలు ఇవ్వడంలో పొదుపు పాటిస్తే ఎలా వుంటుందంటారు?!

✧

◆ మనలో మాట

టపా

అలా వుండాలి

ఈ వారం వచ్చిన 'ప్రేమేరా అన్నింటికీ మూలం' కథ చాలా బాగుంది. తరతరాల నుంచి వస్తున్నది... మనసుల్లో పాతుకుపోయినది కూడా అత్తాకోడళ్ల మధ్య సఖ్యత ఉండదు అనేది. కానీ ఎదుటివారి భావాలకు, ఎదుటివారికి విలువనిస్తూ గౌరవిస్తుంటే గొడవలకు, మనస్పర్థలకు తావుండదన్న వాస్తవాన్ని చక్కగా చెప్పింది కథ. ముఖ్యంగా అత్తగారిని అమ్మలా అనుకుంటే ఇద్దరి మధ్య అపార్థాలకు, గొడవలకు దారితీయవు. అలాగే అత్తగారు కూడా కోడల్ని కూతురుగా భావిస్తేనే వారి మధ్య బంధం బలపడుతుంది. అది గమనంలో ఉంచుకొని మసలుకుంటే ఎలాంటి ఆందోళనలకు తావుండదు.

– ఎన్. రవీంద్ర, తూర్పుగోదావరి.

వ్యాపార సూత్రాలు

సైన్సు ఎంతగా అభివృద్ధి చెందిందో విన్సెంట్ జననమే ఉదాహరణగా చెప్పుకోవచ్చు. నిజంగా ఆ పిల్లాడు పెరిగి పెద్దవాడయ్యాక... చరిత్రలో ఓ సంచలనం సృష్టించాడని తెలుసుకుని తల్లిదండ్రులూ, తనూ చాలా సంబరపడిపోతారేమో! సైన్సు పరంగా అభివృద్ధి చెందినా డాక్టర్లు కూడా ఇలాంటి వినూత్నమైన ప్రయోగాలకు సక్సెస్ చేసేలా సహకరించడం గొప్ప విషయం. ఇక వింతలోకంలో వచ్చిన వృద్ధుల కోసం ప్రత్యేకంగా తయారు చేసిన కుర్చీలు డబ్బున్న వాళ్లకేనేమో అనిపిస్తుంది. అయినా మనుషులు ఓదార్చినట్టు, ఓదార్పు మాటలు చెప్పినట్టుగా కుర్చీలు చేయవు కదా..! ఇలాంటివన్నీ బిజినెస్ ట్రిక్స్ అనీ ఇట్టే తెలిసిపోతున్నాయి.

– జి. సాయి, ఒంగోలు.

తెలుసుకున్నాకే...

ఇక కవర్‌స్టోరీ స్మార్ట్ ఫోన్లపై ఇచ్చింది కొనుగోలుదారులకు తెలియని విషయాలు తెలుసుకునేలా ఉంది. ఎందుకంటే ఫోన్ చూడగానే నచ్చేసి కొనేస్తాం. కానీ కొన్న తర్వాత అనుకున్నట్లు ఫీచర్లు లేకపోతే కొంచెం మనస్థాపానికి గురవుతాం. అందుకే ముందుగా ఆయా ఫోన్లలో వున్న సౌకర్యాల గురించి ముందుగా తెలుసుకోవాలి. ఆ తర్వాతే కొనుగోలు చేయాలి. ఆ విషయం అట్టమీద చదివాక మరింత బాగా అర్థమైంది.

– ఆర్. వెంకట్, గుంటూరు.

సేవా దృక్పథం

సేవ చేయాలంటే మనసుండాలి. సంపాదనకి ఎక్కువ ప్రాధాన్యతనివ్వకుండా తోటివారికి సాయం చేయడంలోనే అసలైన సంతృప్తి, ఆనందం దాగున్నాయని నిరూపించారు ఆటో డ్రైవర్లైన ఉదయ్, అన్నాదొరై. ఇలా నేటికాలంలో ఎంతమంది చేస్తున్నారు.. అని ఆలోచిస్తే చప్పున సమాధానం రాదు. కానీ మనసుతో ఆలోచించి ఎదుటివారికి సాయం చేయాలనే తపన ఉన్నవారికి ఇవేవీ కనపడవు కూడా! ఆటోలు నడిపే వారు తమకు తోచిన రీతిలో సేవ చేయడం అభినందించదగ్గ విషయం.

– ఎ. ఆషా, విజయవాడ.

ఈ సంచికలో....

రీల్... రియాల్టీ!

కవర్‌స్టోరీ — 14

చెట్టు ముందా విత్తు ముందా?వెండి తెరనూ బుల్లి తెరనూ నిజ జీవితం నిర్దేశిస్తున్నదా లేక తెర జీవితమే నిజంగా మారుతున్నదా? రీల్ లైఫ్‌కూ రియల్ లైఫ్‌కూ మధ్య గీత ఎక్కడ చెరిగిపోతున్నది? జీవితంలో నీతులూ బూతులూ తెరపై ఎలా ప్రతిబింబిస్తున్నాయి? తెరపై రీతులూ రోతలూ వికృతులూ జీవితంలోకి ఎలా ప్రవేశిస్తున్నాయి? మిగిలిన విషయాలు అలా వుంచి మహిళల గౌరవ ప్రతిష్టలనూ వ్యక్తిత్వాన్ని శక్తి యుక్తులనూ ఈ తెర జీవితం ఎలా చెర పడుతున్నది? సామాజిక వేత్తలనూ పరిశీలకులనూ కలవర పెడుతున్న ప్రశ్నలివి. కల్లోల పరుస్తున్న కఠిన సత్యాలు ఈవారం అట్టమీది కథలో.

సమ్‌థింగ్ స్పెషల్ **4**
కొలంబో... హీరోనా? యముడా?

రుచి **5**
వంకాయ రుచులు

వింతలోకం **6**
తాడుమీద నిద్ర

నవ్వుల్- పువ్వుల్ **7**

సీరియల్ **8**
ప్రేమ- విప్లవం

కొత్త పుస్తకాలు **11**
ప్రజల చరిత్ర

కథ **18**
రక్త స్పర్శ

గుండెల్లో మంటలు రేపే కథలు **21**

బాలనేస్తాలు **22**

ప్రత్యేకం **24**
ఎంతైనా... సై

సందర్భం — 12

ఐ యామ్ అలీ

భాగ్యనగరిలో సెల్యులార్ జైలు

సెల్యులార్ జైలు! ప్రముఖ పర్యాటక ప్రదేశం! దీన్ని చూడాలనిపిస్తే అండమాన్ దీవులకే వెళ్లాల్సిన పని లేదు. అచ్చంగా కాలాపానీని పోలినదే భాగ్యనగరంలోనూ వుంది.

అండమాన్‌లోని 'కాలాపానీ (సెల్యులార్ జైలు)' ఓ చారిత్రిక కట్టడం. నిజంగానే ఇది అందరూ చూసి తీరాల్సిన కట్టడం కూడా. అయితే అలాంటిదే మన భాగ్యనగరంలోనూ వుందన్న విషయం చాలా మందికి తెలియదు. పైగా ఇది దానికన్నా యాభై సంవత్సరాలు ముందుగానే కట్టిన నిర్మాణం. 1853లో దీన్ని నిర్మించారు. సికింద్రాబాద్‌లోని తిరుమలగిరి చౌరాస్తాకు దగ్గరలో సైనికపురి వెళ్లే దారిలో వుంది. అత్యంత ప్రాచీనమైన ఈ కట్టడాన్ని చూడాలంటే మాత్రం అందరికి కుదరని పని. ఎందుకంటే ఈ భవన ప్రాంగణం మిలిటరీ అధికారుల అధీనంలో వుంటుంది. సంబంధిత అధికారుల ముందస్తు అనుమతి లేనిదే లోపలికి ఎవరినీ అనుమతించరు.

కాలాపానీ మాదిరిగానే వున్న ఈ జైలుని కూడా బ్రిటిష్ వాళ్లే కట్టించారు. నిజానికి దీని తర్వాతే కాలాపానీ నిర్మాణం జరిగింది. అంటే తిరుమల గిరి జైలు నిర్మాణ శైలిలోనే కాలాపానీని కూడా నిర్మించి వుంటారు. అప్పట్లో తప్పు చేసిన బ్రిటిష్ సైనికుల్ని శిక్షించేందుకు మాత్రమే ఈ మిలటరీ జైలుని నిర్మించారట. దీనికి విరుద్ధంగా కాలాపానీని నిర్మించారని స్థానిక అధికారులు చెప్తుంటారు. గోతిక్ నిర్మాణ శైలిలో నిర్మించిన ఈ జైలు ఆకాశంలోంచి చూస్తే శిలువ ఆకారంలో కనిపిస్తుంది. దీనికోసం అప్పట్లో 4.71 లక్షల రూపాయలు ఖర్చు చేశారట.

తూర్పు-పడమర, ఉత్తర-దక్షిణ దిక్కుల్ని సూచిస్తూ మూడు అంతస్తుల్లో మొతం 75 గదులు ఈ జైల్లో వుంటాయి. కింది అంతస్తులో 40 గదులున్నాయి. జైలు గదులన్నీ ఎంతో పటిష్ఠంగా వున్నాయి. మూడు రకాల ఇనుప తలుపులతో అభేద్యంగా నిర్మించారు. లోపల గోడలకు ఖైదీని గట్టి ఇనుపతాళ్లతో కట్టి వుంచే ఏర్పాట్లు వున్నాయి.

జైలు కిటికీ

ప్రతి జైలు గదికీ ఓ చిన్న కిటికీని ఏర్పాటు చేశారు. ఇది చాలా ప్రత్యేకంగా వుంటుంది. గదిలోని ఖైదీ కిటికీలోంచి చూస్తే తన ఎదురుగా వున్నది మాత్రమే కనిపిస్తుంది. చుట్టుపక్కల ఏముందో ఏం జరుగుతందో ఎవరు ఎటు వెళ_న్నారో, వస్తున్నారో గమనించడానికి వీలు లేని రీతిలో వుంటుంది. అదే గది బయట నుంచి కిటికీ ద్వారా లోపలకు చూస్తే ఆ గదిలోని ప్రతి అంగుళం చాలా స్పష్టంగా కనిపిస్తుంది. దీని ద్వారా ఖైదీ ప్రవర్తనను పరిశీలించేవారన్నమాట. క్లుప్తంగా చెప్పాలంటే ఖైదీగా వున్న వ్యక్తికి మరో వ్యక్తి కనిపించని రీతిలో ఈ కిటికీని నిర్మించారు. ఇదే సెల్యులార్ జైలు నిర్మాణ విశిష్టత అని స్థానిక అధికారులు చెప్తారు. దీన్ని బట్టి నాటి బ్రిటిష్ అధికారుల కఠిన మనస్తత్వం బయటపడుతుంది.

జైలు మధ్యలోంచి పైకి వెళ్లేందుకు మెట్లున్నాయి. మొదటి రెండంతస్తుల్లో ఖైదీల కోసం ఏర్పాటు చేసిన గదులుండగా మూడు, ఆ పై అంతస్తుల్లో ఉరిశిక్ష అమలు చేసే ఇనుప కప్పీలు వున్నాయి. ఉరిశిక్ష అమలుకు ముందుగా ఖైదీ తన ఇష్ట దైవాన్ని ప్రార్థించుకునేందుకు పలు దేవతామూర్తుల చిత్రపటాలతో కూడిన చిన్న ప్రార్థనా గది కూడా ఇక్కడ వుంది. ఉరి తీసే సమయంలో ఏదైనా మానవ తప్పిదం వల్ల లేదా సాంకేతిక కారణాల వల్లో ఖైదీకి ఉరి తప్పినా సంబంధిత ఖైదీ నేరుగా బావిలో పడిపోయి మరణించేలా అక్కడే వంద అడుగుల లోతున్న బావిని ఏర్పాటు చేశారు. బావి లోపల పదునైనా ఇనుప ఊచలు వున్నాయి. ఉరి గురి తప్పిన ఖైదీ ఆ బావిలో పడి ప్రాణాలు వదలాల్సిందే. ప్రస్తుతం ఇనుప ఊచలు తొలగించారు. ఉరికంబం మాత్రం వుంది. ఈ జైలులో సుమారు 500 మందికి పైగా ఉరిశిక్ష అమలు చేశారని అధికారులు పేర్కొంటున్నారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో చాలా మంది ఖైదీలను ఇక్కడే బంధీలుగా వుంచారట. ఆపరేషన్ బ్లూస్టార్‌లోని కొందరి ఖైదీల్ని కూడా ఇక్కడే వుంచారనీ అయితే, 1994 నుంచి వినియోగంలో లేదనీ చెబుతున్నారు.

సుమారు 150 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ జైలు పైకి ఎక్కి చూస్తూ సికింద్రాబాద్ నగర పరిసర ప్రాంతం కనుచూపు మేర పచ్చటి వృక్షాలతో దట్టమైన అటవీ ప్రాంతంలా కనిపిస్తుంది. ప్రస్తుతం ఈ భవన ప్రాంగణం టెరిటోరియల్ ఆర్మీ -125 ఇన్ ఫాంట్రీ బెటాలియన్ - ది గార్డు -ఆధీనంలో వుంది. దీనికి 1997లో ఇంటాక్ సంస్థ నుంచి హెరిటేజ్ అవార్డు కూడా లభించింది.

అయితే అండమాన్‌లోని 'కాలాపానీ'ని కేంద్ర ప్రభుత్వం నేషనల్ మ్యూజియంగా ప్రకటించింది. రోజూ వేలమంది సందర్శిస్తున్నారు. దీన్ని కూడా అలా మారిస్తే బాగుంటుంది. లేదంటే ఏడాది పొడవునా కాకున్నా స్వాతంత్రదినోత్సవం నాడో లేదా గణతంత్ర దినోత్సవం నాడో సందర్శకులను అనుమతించినా బాగుంటుందన్నది పర్యాటక ప్రియుల ఆశ. ✧

◆ సమ్‌థింగ్ స్పెషల్

కొలంబస్ కొందరికి నూతన ప్రపంచాన్ని అందించిన గొప్ప హీరో. అదే వ్యక్తి తమదైన ప్రపంచంలో స్వేచ్ఛగా జీవిస్తున్న అమెరికన్ ఆదిమ జాతుల పాలిట యముడు. ప్రతి ఏడాది అక్టోబరు రెండవ సోమవారం నాడు అమెరికా ఖండంలో కొలంబస్ దినోత్సవాన్ని పాటిస్తారు. అదే రోజున కొలంబస్ వ్యతిరేక దినాన్ని జరిపేవారు కూడా ఉన్నారు. ఇటీవలి కాలంలో అమెరికాలో కొలంబస్ దినోత్సవం జరపటాన్ని నిలిపివేస్తున్న రాష్ట్రాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. చూసే కళ్లను బట్టి ఒక వ్యక్తి గురించి ఎంత తేడా? అందువలన ఏ వ్యక్తి లేదా సిద్ధాంతాన్ని అయినా ఎలా అంచనా వేయాలి? తారతమ్యాలు లేని ఆదిమ సమాజం అంతరించి వ్యక్తిగత ఆస్థి ఎప్పుడైతే ఉనికిలోకి వచ్చిందో అప్పటి నుంచి ఇది చర్చనీయాంశమే.

కొలంబస్ హీరోనా? యముడా?

అమెరికా ఖండంలోని బంగారాన్ని వెలికితీసేందుకు వేలాది మంది స్థానికులను బానిసలుగా చేయటమేగాక మరణానికి కూడా కొలంబస్ కారకుడయ్యాడని 'అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రజా చరిత్ర' రాసిన హోవర్డ్ జిన్ పేర్కొన్నారు. రెండు సంవత్సరాల వ్యవధిలో హైతీలోని రెండున్నర లక్షల మంది రెడ్ ఇండియన్లలో సగం మంది హత్యలు, అంగచ్ఛేదం లేదా ఆత్మహత్యలకు పురికొల్పటం వల్లగానీ మరణించారని, ఇది సామూహిక మారణకాండ తప్ప మరొకటి కాదని పేర్కొన్నారు. ఈ క్రమంలో 1515 నాటికి యాభై వేల మంది, 1550 నాటికి కేవలం ఐదు మంది మాత్రమే మిగిలారు, 1650లో తయారు చేసిన ఒక నివేదిక ప్రకారం ఆర్వాక్స్ అనే తెగకు చెందిన వారు ఒక్కరంటే ఒక్కరు కూడా ఆ దీవిలో మిగల్లేదు.

కొలంబస్ తరువాత అమెరికా ఖండాలకు వలస వచ్చిన ఐరోపా వారు రెడ్ ఇండియన్లను ఊచకోత కోశారు. వారి భూములను ఆక్రమించారు, సంపదలను కొల్లగొట్టారు. తమ గడ్డపైనే హక్కులు లేకుండా కొన్ని ప్రాంతాలకు పరిమితం చేశారు. ఆ వివక్ష ఇప్పటికీ కొనసాగుతున్నది. కొలంబస్ అమెరికాను కనుగొనలేదు దోచుకున్నాడు, అక్కడి జనం పట్ల దారుణంగా ప్రవర్తించాడని సియాటిల్ నగర కౌన్సిల్ సభ్యురాలైన సోషలిస్టు కష్మా సావంత్ ఈ సందర్భంగా ఒక ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. మినియా పొలీస్, సియాటిల్ నగరాలలో కొలంబస్ దినోత్సవం బదులు ఆరోజును ఆదిమ తెగల రోజుగా పాటించారు. ఈ మేరకు సియాటిల్ నగరపాలక సంస్థ అధికారయుతంగా ఏకగ్రీవంగా ఒక తీర్మానమే చేసింది. ఆ సందర్భంగా అదిమ జాతి కార్యకర్తలు ఆనందం పట్టలేక ఆనందం, ఏడుపులతో పాటలు పాడి ఉత్సవం జరుపుకున్నారు. ఇది జాత్యహంకారం, వివిక్షకు వ్యతిరేకంగా ఒక వైఖరిని తీసుకోవటంగా కష్మా సావంత్ వర్ణించారు. సియాటిల్‌కు చెందిన ఆరుగురు ఇటాలియన్-అమెరికన్ సంతతికి చెందిన వారు నిరసన తెలుపుతూ ఇప్పటి వరకు తాము ఇటాలియన్ అయిన కొలంబస్ వారసత్వం గురించి గొప్పగా భావిస్తున్నామని ఇప్పుడు అది విలువలేనిదిగా మారిందని వాపోయారు. నిజానికి కొలంబస్ తొలిసారిగా నేడు అమెరికా సంయుక్త రాష్ట్రాలుగా ఉనికిలో ఉన్న గడ్డపై అడుగు పెట్టలేదు. కరీబియన్ దీవుల్లోని బెర్కిలే కాలిఫ్‌లో దిగాడు. కొలంబస్ తొలి యాత్రలో దిగిన దీవి పేరు బహామాస్ అని తరువాత దానికి హిస్‌పానియోలా అని పేరు పెట్టారని, అది ఇప్పుడు హైతీ, డొమినికన్ రిపబ్లిక్‌ల మధ్య విభజితమై ఉందని, తదుపరి యాత్రలలో మధ్య, దక్షిణ అమెరికా ప్రాంతాలకు వెళ్లాడని, ఇప్పుడు అమెరికా సంయుక్త రాష్ట్రాలుగా పిలుస్తున్న ప్రాంతానికి అసలు వెళ్లలేదని, అటువంటపుడు 'కొలంబస్ రోజు'ను అమెరికాలో ఎందుకు జరుపుకోవాలని క్రిస్టోఫర్ వాన్‌జెక్ ప్రశ్నించాడు. 1497 ప్రాంతంలో జాన్ కాబోట్ న్యూఫౌండ్‌లాండ్‌ను కనుగొని బ్రిటన్ వలసకు నాంది పలికాడని ఆ కారణంగానే తొలి అమెరికా సంయుక్త రాష్ట్రాలు బ్రిటన్‌తో పోరాడాయి తప్ప స్పెయిన్‌తో కాదని కూడా వాన్‌జిక్ అంటారు.

చరిత్రపై ఇంత వివాదం ఉంది కనుకనే 1990లో కొలంబస్ డే జరపరాదని కేవలం మూడు రాష్ట్రాలే పేర్కొంటే ఇప్పుడు వాటి సంఖ్య 16కు పెరిగింది. యూరోపియన్లు అమెరికాను ఆక్రమించిన నాటి నుంచి ఆ ఖండంలోని ఆదిమ తెగలను నాశనం చేసేందుకే ప్రయత్నించారు. వీలుగాక మిగిలిన వారిని కొన్ని ప్రాంతాలకు పరిమితం చేశారు. విద్యా, ఉద్యోగాలు ఇలా ఏ రంగంలో చూసినా వారు ఇప్పటికీ మిగతావారితో పోల్చితే ఎంతో వెనుకబడి ఉన్నారు. అమెరికాలో దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న జనాభా 14.5 శాతమైతే ఆదిమ జాతులను పరిమితం చేసిన రిజర్వు ప్రాంతాలలో 20 నుంచి 53.3 శాతం వరకు ఉన్నారు. నిరుద్యోగం కూడా తెల్లవారితో పోల్చితే రెట్టింపు ఉంది. అమెరికా ఖండానికి ఐరోపా వారు ఆఫ్రికా ఖండం నుంచి జనాన్ని బానిసలుగా పట్టుకు రాక ముందే ఆఫ్రికన్లు అమెరికా ఖండంలో ప్రవేశించారని కొందరు చరిత్ర కారులు చెప్పటం గమనించాల్సిన విషయం. అట్లాంటిక్ సముద్రం మీదుగా క్రీస్తుశకానికి ముందే అమెరికా ఖండానికి ఈజిప్టు, పశ్చిమ ఆఫ్రికా నుంచి తరచు వచ్చారనేందుకు ఆధారాలున్నాయని చెబుతున్నారు. పిరమిడ్ల నిర్మాణం, రాజకీయ వ్యవస్థలు, మతాచారాలు, గణితం, రాత, క్యాలెండర్ వారు తెచ్చినవే అంటున్నారు. నల్లని వర్ణం గలవారు పడవలలో ఆగ్నేయం నుంచి వచ్చారని స్వయంగా కొలంబస్ తన రచనల్లో పేర్కొనటాన్ని వారు ఉటంకిస్తున్నారు. క్రీస్తు పూర్వం 445లోనే గ్రీసు చరిత్రకారుడు హెరడోటస్ ఈజిప్టు వారి నౌకాయాన నైపుణ్యాల గురించి రాశాడని, 1311లో మాలీ రాజు అబుబకారీ న్యూవరల్డ్‌కు 200 నావల్లో మనుషులు, మరో రెండువందల నావల్లో సరకులను వాణిజ్యం కోసం పంపినట్లు చరిత్రకారులు పేర్కొన్నారు. అమెరికా ఖండంలో అనేక ఆఫ్రికన్ వస్తువులు, కళల చిహ్నాలు దొరికాయి. అయితే ఐరోపా చరిత్రకారులు కావాలనే వీటన్నింటినీ మరుగున పరచటం లేదా తక్కువ చేసి చూపారని కొందరు అభిప్రాయపడుతున్నారు. కొలంబస్‌కు ముందే ఆఫ్రికన్లు అమెరికా ఖండాన్ని సందర్శించారని చెప్పేందుకు కొన్ని పురావస్తు ఆధారాలను ఉటంకిస్తున్నారు.పురాతన ఈజిప్షియన్ మమ్మీలతో పాటు కొకెయిన్, నికోటిన్ అనవాళ్లు దొరికాయని, అవి అమెరికా ఖండంలోని మొక్కలనుంచి తప్ప మరొక చోట నుంచి తయారై ఉండకపోవచ్చని జర్మన్ టాక్సికాలజిస్ట్ స్వెట్లా బాలబనోవా అభిప్రాయం.

- సత్య

వంకాయ రుచులు

వంకాయ బజ్జీ

కావలసినవి : వంకాయలు : పావుకిలో, సెనగపిండి, పెద్ద కప్పు, ఉప్పు : అరటీస్పూను, కారం : టీ స్పూను, ధనియాల పొడి : 2 టీస్పూన్లు, గరంమసాలా : టీ స్పూను, సోడా : చిటికెడు, నూనె: వేయించడానికి సరిపడా.

తయారుచేసే విధానం : పొడవాటి వంకాయలను నిలువు ముక్కలుగా కోయాలి. పొట్టి వంకాయలైతే గుండ్రని స్లైసుల్లా అంటే చిప్స్‌లా కోసి ఉప్పునీళ్లలో వేయాలి. ఓ గిన్నెలో సెనగపిండి, ఉప్పు, కారం, ధనియాల పొడి, గరంమసాలా పొడి, వంటసోడా వేసి గరిటె జారుగా కలిపి పదినిమిషాలు ఉంచాలి. ఇప్పుడు వంకాయ ముక్కలు నీళ్లలో నుంచి తీసి కాస్త ఆరనిచ్చి రెండువైపులా ఉప్పు, కారం చల్లాలి. ఇలా చేయడం వల్ల బజ్జీలు చప్పగా ఉండకుండా ఉంటాయి. బాణలిలో నూనె వేసి కాగాక వంకాయ ముక్కలను ఒక్కొక్కటిగా సెనగపిండిలో ముంచి వేయాలి. కరకరలాడేట్టు ఎర్రగా వేయించి తీసి టిష్యూ పేపర్ మీద వేస్తే ఎక్కువగా ఉన్న నూనెను పీల్చేసుకుంటాయి. వీటిని టొమాటో సాస్‌తో వడ్డిస్తే భలే రుచిగా ఉంటాయి. వంకాయ ముక్కలను ముందుగానే కరకరలాడేలా వేయించి తీసి అప్పుడు పిండిలో ముంచి కూడా బజ్జీలు వేసుకోవచ్చు.

వంకాయ సెనగపప్పు కూర

కావలసినవి : వంకాయలు: పావుకిలో, సెనగపప్పు : అరకప్పు, ఉల్లిపాయ : ఒకటి, కరివేపాకు : 2 రెబ్బలు, అల్లంవెల్లుల్లి: టీస్పూను, పసుపు : పావు టీ స్పూను, కారం : టీ స్పూను ఉప్పు : టీ స్పూను, గరంమసాలా : పావు టీస్పూను, నూనె : 3 టేబుల్ స్పూన్లు.

తయారు చేసే విధానం : సెనగపప్పును కడిగి నానబెట్టాలి. వంకాయలను ముక్కలుగా కోసి ఉప్పునీళ్లలో వేసి ఉంచాలి. ఉల్లిపాయలను సన్నగా సరగాలి. పాన్ తీసుకుని నూనె వేసి కాగాక ఉల్లిపాయ ముక్కలు వేసి వేయించాలి. అవి వేగాక కరివేపాకు, పసుపు, అల్లంవెల్లుల్లి ముద్ద, కారం, సెనగపప్పు వేసి రెండు నిమిషాలు వేయించాలి. తరువాత వంకాయ ముక్కలు, ఉప్పు వేసి కలిపి మూతపెట్టి సన్నని మంటమీద ఉడికించాలి. ముక్క మెత్తబడిన తరువాత కప్పు నీళ్లు పోసి మూతపెట్టి ఉడికించాలి. వంకాయలు, పప్పు బాగా ఉడికిన తర్వాత గరంమసాలా చల్లి దించితే కూర రెడీ. ఇది చపాతీల్లోకి కూడా బాగుంటుంది.

గుత్తివంకాయ వేపుడు

కావలసినవి : గుండ్రని వంకాయలు: పావుకిలో, సెనగపిండి : అరకప్పు, పసుపు : చిటికెడు: కారం : టీ స్పూను, ధనియాల పొడి : టేబుల్‌స్పూను, ఉప్పు : అరటీస్పూను, కొత్తిమీర తురుము : టేబుల్‌స్పూను, నూనె : 8 టేబుల్ స్పూన్లు.

తయారుచేసే విధానం : గుత్తివంకాయకి కోసినట్లే ముక్కలుగా విడిపోకుండా వంకాయలు కోసుకుని ఉప్పు నీళ్లలో వేయాలి. విడిగా ఓ గిన్నెలో సెనగపిండి, ఉప్పు, కారం, కొత్తిమీర, ధనియాలపొడి, పసుపు, 2 టీస్పూన్ల నూనె వేసి బాగా కలపాలి. ఈ ముద్దను వంకాయల్లో కూరాలి. వెడల్పాటి పాన్ తీసుకుని నూనె వేసి కాగాక మసాలా కూరిన వంకాయలను వేసి విడిపోకుండా నిదానంగా వేయించాలి. మూత పెట్టకుండా సిమ్‌లోనే వేయించి దించాలి.

వంకాయ కుర్మా

కావలసినవి : చిన్నవి, గుండ్రని వంకాయలు : పావుకిలో, ఉల్లిపాయలు : 2, అల్లంవెల్లుల్లి : టీస్పూను, పెరుగు : అరకప్పు, కొబ్బరిపొడి: 2 టేబుల్‌స్పూన్లు, జీలకర్ర పొడి : అరటీ స్పూను, మెంతిపొడి : పావు టీ స్పూను, ధనియాలపొడి : టేబుల్ స్పూను, వేరుసెనగపప్పు : 3 టేబుల్ స్పూన్లు, నువ్వులు : టేబుల్ స్పూను, పసుపు: పావు టీ స్పూను, కారం : టేబుల్‌స్పూను, జీలకర్ర : పావుటీ స్పూను, మెంతులు : చిటికెడు, కరివేపాకు: 2 రెబ్బలు, ఉప్పు: తగినంత, కొత్తిమీర: కొద్దిగా, నూనె : 4 టేబుల్ స్పూన్లు.

తయారుచేసే విధానం : వంకాయను విడిపోకుండా నాలుగు ముక్కలుగా గుత్తివంకాయ మాదిరిగానే చీల్చి ఉప్పు నీళ్లలో వేసి ఉంచాలి. బాణలిలో ఓ స్పూను నూనె వేసి సన్నగా తరిగిన ఉల్లిపాయలు మెత్తబడేవరకూ వేయించి తీసి పక్కన పెట్టాలి. వేరుసెనగపప్పు, నువ్వులు కొద్దిగా వేయించి పొడి చేయాలి. కొబ్బరిపొడి, ధనియాలపొడి, జీలకర్రపొడి, మెంతిపొడి, వేరుసెనగపొడి అన్నీ కలపాలి. తరువాత అందులో వేయించిన ఉల్లిపాయలు, పసుపు, కారం, అల్లంవెల్లుల్లి ముద్ద, పెరుగు, కొత్తిమీర కలిపి మెత్తగా రుబ్బాలి. నీళ్లలో వేసిన వంకాయలను తీసి నూరిన ముద్దను కొంచెంకొంచెంగా కూరి మిగిలినది పక్కన ఉంచాలి. ఇప్పుడు ఉల్లిపాయలు వేయించిన బాణలిలోనే మిగిలిన నూనె వేసి కాగాక జీలకర్ర, మెంతులు వేసి వేయించాలి. తరువాత కూరిన వంకాయలు వేసి వెంటనే మూతపెట్టాలి. తక్కువ మంటమీద ఉడికించాలి. వంకాయలు మెత్తబడ్డ తరువాత మిగిలిన ముద్దలో కాసిన్ని నీళ్లు కలిపి పలుచగా చేసి కూరలో పోసి నూనె తేలేవరకూ ఉడికించాలి.



చెక్కలతో తలపడాలి

నెత్తి మీద పొడవాటి, పల్చపాటి చెక్కలు పెట్టుకుని ... తల పడే ఆట గురించి విన్నారా ఎప్పుడైనా? లేదా? అయితే ఇవాళ ఆ క్రీడాకారులు మీ ముందుకు వచ్చేశారు. ఈ తమాషా ఆట చెక్ రిపబ్లిక్‌లో వుంది. 1992 నుంచి ఆడుతున్నారక్కడ. ఈ ఆటను పిల్లలు, పెద్దలు, మహిళలు, పురుషులు...అన్న తేడా లేకుండా అందరూ ఆడుకోవచ్చు. అయితే దీనికి వున్న ఒకే ఒక్క షరతు ఏమంటే... ప్రతి ఒక్కరూ నెత్తిమీద చెక్క ముక్కలను పెట్టుకోవాలి. అది మూడు నుంచి నాలుగు కిలోల బరువు వుంటుంది. ఒకసారి బరిలోకి దిగాక...క్రీడాకారులు తమ నెత్తమీద వున్న చెక్క ముక్కను పడిపోకుండా కాపాడుకుంటూ ఎదుటివారి నెత్తిమీది చెక్కను

పడేయాలి. అప్పుడు గెలుపొందినట్టు. సీనియర్ క్రీడాకారులు ఈ ఆటను ఒలింపిక్స్‌లో ప్రవేశపెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఒక్కొక్కరికి ఒక్కో ఆలోచన వస్తుంది. ఇక అది చేసే వరకూ వారు నిలవరు. అలాంటివాడే మట్ కలేజా. ఆస్ట్రేలియాకు చెందిన ఇతగాడికి 1001 మంది ఫేస్ బుక్ నేస్తాలున్నారు. ఒకానొక క్షణాన వారందరిని కలిసి కాఫీ తాగితే ఎలా వుంటుంది? అన్న ఆలోచన

ఫేస్‌బుక్ నేస్తాలతో...కప్పు కాఫీ

వచ్చిందట. అప్పటి నుంచి ఇక అదే పనిలో పడ్డాడు. ఇప్పటికి 29 మందితో కాఫీ తాగేశాడు. వారానికి ఇద్దరు చొప్పున కలిసి కాఫీ తాగితే... 2018 నాటికి తను అనుకున్న పని పూర్తవుతుందట. ఈయన గారిని చూసే ఆశ్చర్యపోతున్నారేమో! ఇలాంటి క్యాండిడేట్ మరొకరున్నారు. ఆమె పేరు అప్పట్లో మారు మోగిపోయింది లెండి. మరి! ఆమెగారికి ప్రపంచవ్యాప్తంగా వున్న 365 మంది ఫేస్ బుక్ నేస్తాలను కలిసి మాట్లాడాలనుకుంది. అనుకోవడమే కాక... ఆచరించింది కూడా. వీరి గురించి విన్నాక ఏమనిపిస్తుంది? 'ఇలాంటి వారు కూడా వుంటారు కామోసు' అనేనా!

కుడి ఎడమైతే...

...పొరపాటు లేదోయ్...అన్నాడు కదా... ప్రొసీడైపోవచ్చు అనుకుంటారేమో! సమస్యలు కూడా వస్తుంటాయండోయ్. కావాలంటే ఇదిగో ఈ ఫ్లోరిడా జంటను ఆ మాట అడిగి చూడండి. వీరు 2012లో ఓ స్థలం కొనుగోలు చేశారు. తర్వాత ఇల్లు కట్టిమ్మని ఓ కంపెనీని అడిగారు. ఆ కంపెనీ కట్టిచ్చింది. మూడు అంతస్థుల్లో, ఐదు పడగ్గదులు, ఇతర హంగులు వున్న ఆ ఇంటిని చూసుకుని వారైతే తెగ మురిసిపోయారు. ఆ మురిపెం ఎంతో సేపు నిలబడలా! కారణం. ఆ ఇల్లు కట్టించుకున్నది వారే అయినప్పటికీ ...అది తమ స్థలంలో కాకుండా పక్క వాడి స్థలంలో కట్టేశారట. ఈ వార్త తెలిసి నోట మాట రాలేదనుకోండి ఆ దంపతులకు. ఇలా ఎందుకు కట్టేవయ్యా? అని కంపెనీ యజమానిని అడిగితే... 'మా కంపెనీ పెట్టాక... ఇప్పటి వరకు 600 ఇళ్లు కట్టిచ్చాను. కానీ ఇలా ఎప్పుడూ పొరపాటు జరగలేదు. ఈ సారే...ఎందుకిలా జరిగిందో...' అంటున్నాడట. ఇక తప్పు జరిగిపోయాక...నివారణకు ఏం చేయాలో ఆలోచించుకోవాలి కదా. రెండు పార్టీలను

కూర్చోబెట్టి తక్కువ నష్టంతో పరిష్కారం చేసుకునే మార్గాల కోసం ఆలోచిస్తున్నారట. సో...కొత్తగా ఇల్లు కట్టుకోవాలనుకునేవారెవరైనా... కుడి ఎడమలు, ముందు వెనుకలు జాగ్రత్తగా ఒకటికి పదిసార్లు నిర్ధారణ చేసుకున్నాకే...శంకుస్థాపన చేయాలి! ఏమంటారు?

తాడు మీద నిద్ర

సాధన వుంటే సాధించలేనిది లేదని పెద్దలు ఊరకే అనలేదండీ. ఇదిగో లియాంగ్ యాంగౌ లాంటి వారిని చూసే చెప్పి వుంటారు. బొమ్మలో చూశారుగా! ఈయనగారికి నిద్ర పోవడానికి మంచం, పరుపు, దిండు ... ఏమీ అవసరం లేదు. అంతే కాదు! ప్రత్యేకంగా ఒక గది వుండాలని కూడా లేదు. రోడ్డు మీద, పార్కులో, బీచ్‌లో ఎక్కడైనా నిద్రపోగలడు. కాకపోతే రెండు చెట్లు వుంటే చాలు. వాటికి ఓ నైలాన్ తాడు కట్టుకుని ఇదిగో బొమ్మలో మాదిరిగా పడక

వేసేస్తాడు. ఇదిగో ఈ దృశ్యంలో ఈయనగారిని చూడ్డానికి జనం తెగ ఎగబడతారట. ఇక సెల్ఫీలంటారా! లెక్కే లేదు. అంతేకాదు. కొందరు ఔత్సాహికులు లియాంగ్ ఆటోగ్రాఫ్ కూడా తీసుకుంటారు. నిజానికి లియాంగ్ ఈ మధ్యే క్యాన్సర్ బారిన పడ్డాడు. గొంతు ఆపరేషన్ చేసి ఆ రాక్షస పుండును తీసేశారు. జబ్బు నయమైనప్పటికీ ... పూర్తి విశ్రాంతి తీసుకోమన్నది వైద్యుల సలహా. కానీ మనోడు ఊరుకుంటేగా! ఇలా ఫీట్లు చేస్తూనే వుంటాడు. మరి కుంగ్‌ఫూ మాస్టర్‌గారు ఖాళీగా ఎలా వుంటారు చెప్పండి.

నవ్వుల్ – పువ్వుల్

జడ్జిగారి మీదే!

లాయర్ : భగవద్గీత మీద ప్రమాణం చేయవా, మరి దేనిమీద ప్రమాణం చేస్తావ్...?

నిందితుడు : జడ్జి గారి తల మీద...! ఠక్కున చెప్పాడు ముద్దాయి

కొనక



టీచర్ : రెండు రెళ్లెంతరా...?

విద్యార్థి : ఏమో, ఎక్కాల పుస్తకం ఇంకా కొనలేదు..!

అరుపు

రోగి : పన్ను పీకడానికి ఎంత తీసుకుంటారు డాక్టర్...?

డాక్టర్ : అది నీవు అరిచేదాన్ని బట్టి వుంటుంది...!

రోగి : అదేమిటి...?

డాక్టర్ : అదంతే, నీవు గట్టిగా అరిస్తే రేటెక్కువ, నెమ్మదిగా అరిస్తే రేటు తక్కువ... అలా..!

నిలబెట్టాలి



అనీల్ : మీ నాన్నగారి పేరు నిలబెట్టాలిరా...!

సునీల్ : అలాగే ఈఫిల్‌టవర్ మీద నిలబెడతా...!

జీవితానికి భరోసా



కవి: నేను కొన్ని కవితలు చదువుతాను, వింటావా?

సుబ్బారావు : లేదు.. నాకు ఇన్సూరెన్సు పాలసీ చేయించి అప్పుడు వినిపించు...!

ఫీజు

రోగి : నాకు ఒళ్లు మండిపోతుంది... డాక్టర్..!

డాక్టర్ : చన్నీళ్లు మీద పోస్తాగాని, నా ఫీజిచ్చేయ్...!

అబ్బో!



లింగయ్య: స్వీటు రేటెంతండి...?

షాపు యజమాని : వంద రూపాయలు..!

లింగయ్య : అయితే 5 గ్రాముల స్వీటివ్వండి..!

ఇవ్వడానికి!

చందు : మాకు విడాకులు కావాలి లాయర్ గారూ..!

లాయర్ : దేనికి...?

చందు : మీకు ఫీజు ఇవ్వడానికి...!

అప్పు కావాలా

మహేష్ : నీకు అప్పు కావాలా... దేనికి...?

సురేష్ : నాకు అప్పిచ్చిన వాడిని, నా చుట్టూ తిప్పుకోవడానికి...!

ఎప్పటినుంచి?



లత: నేను ఓ వృక్షాన్ని పెంచుతున్నాను తెలుసా...?

రాణి : ఎప్పటి నుంచి...?

లత: నిన్నటి నుంచే.. నిన్ననే విత్తనం వేశాను...!

- ముత్యాల శ్రీశరత్‌బాబు,

ఫోన్ నెం : 9963298921

ప్రేమ... విప్లవం...

మార్క్స్, జెన్నీ ప్రేమ కథ

◆ సీరియల్

మూలం : మేరీ గేబ్రియెల్ 'లవ్ అండ్ కేపిటల్'

స్వేచ్ఛానువాదం: ముక్తవరం పార్థసారథి

ఫ్రెంచి విప్లవ కాలంలో (1789–1799) పద్దెనిమిదేళ్ల లూయీ ఫిలిప్, అప్పటి రాజుగార్ని గద్దె దించటానికి ప్రయత్నించాడు. ఆ తర్వాత, ఇంగ్లండు, అమెరికాలో ప్రయాణించటం వల్ల ఆధునిక, అభ్యుదయ రాజకీయ అభిప్రాయాలను కొంత వంట పట్టించుకున్నాడు. ఇప్పుడు, తన పాలన పట్ల ఎంత వ్యతిరేకత పెల్లుబికినా, తన వ్యాపారానికి అడ్డు తగలనంత వరకూ పరవాలేదనుకున్నాడు. పదవీచ్యుతుడైన తన తండ్రి నుంచి నేర్చుకున్న పాఠం ఒక్కటే. నిరసనకారుల పట్ల, ప్రతిపక్షం పట్ల కొంత పట్టూవిడుపూ వుండాలి. ఇలా ఉండటం తన వ్యాపార ప్రయోజనాలకు కూడా అవసరం. వాణిజ్యం బాగుంటేనే కదా! ప్రభుత్వ ఖజానాలోకి పన్నులు వచ్చి చేరతాయి. ఈ నిర్ణయాల ఫలితంగా, పారిస్ తళుకు బెళు కులతో జిగేల్మంది. 250 గజాల షాంటిలీ లేస్, ఇండియన్ కాశ్మీర్ (గుడ్డ)తో తయారు

“ పారిస్‌లోని అందగత్తెల మధ్య కూడా తన అందంతో మేధో చతురతతో అందర్నీ ఆకర్షించింది జెన్నీ. మార్క్స్‌కు జెన్నీని చూస్తే గర్వంగా ఉంటుంది. తొలి రోజుల నుండీ, ఆమెను తనతో సరిసమానమైన వ్యక్తిగానే పరిగణించాడు. చర్చలలో మార్క్స్ ఎవర్నైనా చీల్చి చెండాడతాడు. ఎదుటి వ్యక్తి వాదాన్ని తన తార్కిక ప్రావీణ్యంతో నిర్వీర్యం చేస్తాడు. అలాంటివాడు కూడా, జెన్నీ అభిప్రాయాలకు ఎంతో విలువ ఇచ్చాడు. తన జీవితంలో, అంతగా గౌరవించిన మరొక వ్యక్తి ఎంగెల్స్ మాత్రమే. చర్చలలో ఉగ్ర నరసింహుడిగా ఉండే మార్క్స్‌ను శాంతింపజేయగల శక్తి జెన్నీకి మాత్రమే ఉంది. ”

చేసిన గౌను 10,000 ఫ్రాంకులకు అమ్ముడుపోయింది. అది ఒక కూలీనాలీ చేసుకునే కుటుంబానికి ఏడాది ఆదాయం. అయితే, ఇంత విలాస జీవితం ఉన్న పారిస్‌లో రాడికల్ వామపక్ష ప్రవక్తలు తిష్టవేశారు (వీళ్ల వెంట వున్న మహిళలు పైన చెప్పిన ఖరీదైన డ్రెస్సుల్లాంటివి ధరించినప్పటికీ) ఆనాటి 'యూరోపియన్ నాగరికతకు కేంద్రం పారిస్' అన్నాడు ఎంగెల్స్.

ఇలాంటి పారిస్ సంరంభంలోకి ప్రవేశించారు మార్క్స్ దంపతులు. ఇక్కడి స్వేచ్ఛా వాతావరణం కోసమే వచ్చారు వాళ్లు. ఏదైనా రాసుకోవచ్చు, ప్రచురించవచ్చు. ఏ ఆంక్షలూ లేవు. నిజానికి ఇక్కడి స్వేచ్ఛ, వాళ్లు ఊహించిన దానికన్నా చాలా ఎక్కువ. ప్రష్యాలో అదొక ఊహ. ఒక భావన మాత్రమే. ఇక్కడ అది ఒక అనుభవం. ఇక్కడ ప్రభుత్వాన్ని ప్రశ్నించగలరు. నిలదీయగలరు. లిబరలిజం, సోషలిజం, కమ్యూనిజం, నేషనలిజం గురించిన చర్చలు బాహాటంగా జరుగుతున్నాయి. కార్ల్, జెన్నీలు స్వదేశం కదిలి రావటం ఇదే తొలిసారి. అయినా, పారిస్ వాళ్లకు నచ్చింది. తమ కార్యక్షేత్రం ఇదే అనుకున్నారు.

పారిస్ జీవితంలో నాటక రంగం ఒక ప్రధాన భాగం. జెన్నీకి హాస్య, వ్యంగ్య నాటక ప్రదర్శనలంటే ఇష్టం. ఇక్కడి సంపన్నుల జీవిత సరళి ఆమెను ఆశ్చర్యం కలిగించింది. వాళ్లకు ప్రేమ వ్యవహారాలు తప్ప మరేమీ పట్టవు. ఇళ్లలో పనిమనుషులు వాళ్లకు అన్ని రకాల సేవలూ చేస్తుంటారు. కానీ ఈ సేవకులే వాళ్ల శత్రువులు. పేదలకు ధనికులంటే

అసహ్యం, ద్వేషం. అవకాశం వచ్చినప్పుడు మొదట తిరగబడేది వాళ్లే.

తన తొలి యవ్వనమంతా ట్రీయర్‌లో కార్ల్ నిరీక్షణలో గడిపిన జెన్నీకి ఇప్పుడు తన కలల లోకం కళ్ల ముందు కనిపించింది. పత్రిక వల్ల మార్క్స్ ఆదాయం పెరుగుతుంది. సుఖంగా బతకొచ్చు. తను రాయదలచుకున్న పుస్తకాల గురించి చెప్పాడు కార్ల్. తను అవన్నీ కాపీ చేసి పెడుతుంది. త్వరలో తల్లి కాబోతున్నది. ఇక్కడ విప్లవ భావాలు కూడా అందంగానే కనిపిస్తున్నాయి. ఇన్నాళ్లు రైన్‌లాండ్‌లో గడిపిన జెన్నీకి పారిస్ జీవితం మత్తెక్కించింది.

వీళ్లు రావటానికి ముందే రూగ్, భార్యా పిల్లలతో, సరిపడా ఆహార నిల్వలతో అక్కడికి చేరుకున్నాడు. పెళ్లి వల్ల అతడికి డబ్బు కలిసొచ్చింది. కానీ మహా జాగ్రత్తపరుడు. తాము, మరో కవి జార్జ్ హెర్విగ్, ఆయన భార్యతో కలిసి సమిష్టి జీవితం గడిపితే పొదుపుగా బతకవచ్చునని కార్ల్ దంపతులకు సూచించాడు రూగ్. ముగ్గురు పురుషులూ పత్రికలో పనిచేసేవాళ్లే. వాళ్లు వుంటున్న చోటుకి ఎదురుగానే పత్రికాఫీసు. ఆడవాళ్లు కలిసి మెలిసి ఇంటి పనులు చేసుకోవచ్చు. మొదట ఈ ప్రతిపాదన మార్క్స్ దంపతులకు నచ్చి ఉంటుంది. తోటి జర్మన్లతో కలిసి సరదాగా గడపొచ్చు. కానీ ఆ సంతోషం ఎక్కువకాలం నిలవలేదు. అనేక సంవత్సరాల తర్వాత, హెర్విగ్ కుమారుడు నెమరేసుకున్నట్టుగా, 'సాదాసీదాగా వుండే రూగ్ భార్య, బాగా చదువుకున్న మేధావి అయిన జెన్నీతో కలిసి వుండటం అసాధ్యం' కేవలం రెండు వారాలు మాత్రమే ఈ 'సమిష్టి సంసారం' కొనసాగింది. అవకాశం దొరికిన వెంటనే, మార్క్స్ దంపతులు మరో విశాలమైన ఇంటికి మారారు.

పారిస్‌లోని రాడికల్, ప్రజాస్వామిక బృందాలతో సన్నిహితంగా మెలిగారు మార్క్స్ దంపతులు. మొదటిసారి తమను తాము మిస్టర్ అండ్ మిసెస్ మార్క్స్‌గా పరిచయం చేసుకున్నారు. పారిస్‌లోని అందగత్తెల మధ్య కూడా తన అందంతో మేధో చతురతతో అందర్నీ ఆకర్షించింది జెన్నీ. మార్క్స్‌కు జెన్నీని చూస్తే గర్వంగా ఉంటుంది. తొలి రోజుల నుండీ, ఆమెను తనతో సరిసమానమైన వ్యక్తిగానే పరిగణించాడు. చర్చలలో మార్క్స్ ఎవర్నైనా చీల్చి చెండాడతాడు. ఎదుటి వ్యక్తి వాదాన్ని తన తార్కిక ప్రావీణ్యంతో నిర్వీర్యం చేస్తాడు. అలాంటివాడు కూడా, జెన్నీ అభిప్రాయాలకు

జెన్నీ

"తన తొలి యవ్వనమంతా ట్రీయర్‌లో కార్ల్ నిరీక్షణలో గడిపిన జెన్నీకి ఇప్పుడు తన కలల లోకం కళ్ల ముందు కనిపించింది. పత్రిక వల్ల మార్క్స్ ఆదాయం పెరుగుతుంది. సుఖంగా బతకొచ్చు. తను రాయదలచుకున్న పుస్తకాల గురించి చెప్పాడు కార్ల్. తను అవన్నీ కాపీ చేసి పెడుతుంది. త్వరలో తల్లి కాబోతున్నది. ఇక్కడ విప్లవ భావాలు కూడా అందంగానే కనిపిస్తున్నాయి. ఇన్నాళ్లూ రైన్‌లాండ్‌లో గడిపిన జెన్నీకి పారిస్ జీవితం మత్తెక్కించింది."

ఎంతో విలువ ఇచ్చాడు. తన జీవితంలో, అంతగా గౌరవించిన మరొక వ్యక్తి ఎంగెల్స్ మాత్రమే. చర్చలలో ఉగ్ర నరసింహుడిగా ఉండే మార్క్స్‌ను శాంతింపజేయగల శక్తి జెన్నీకి మాత్రమే ఉంది.

ఇతర సమయాలలో చాలా సరదాగా ఉంటాడు మార్క్స్. పని ఒత్తిడితో చికాకు పెరిగినప్పుడు మాత్రం ఆయన మూడ్ మారిపోతుంది. అప్పుడు, రాత్రుళ్లు నిద్రపోడు. తరచూ జబ్బు పడతాడు. వాదోపవాదాలలో జగమొండి. తనతో విభేదించిన వాళ్లంటే అసహనం. బాన్, బెర్లిన్, కొలోన్‌లలో తాగుతూ కూర్చున్నప్పుడు, పొట్లాటలు తన్నుకునే దాకా పోలేదుగాని గట్టిగా అరచుకోవటం మామూలే. ఆయనది మర్యాదల్ని పట్టించుకోని స్వభావం. పరాయీకరణ గురించి అంతగా రాసిన మనిషి ఎవరితోనూ కలవటానికి పెద్దగా ఇష్టపడడు. తన ప్రవర్తనతో, అసహనంతో అనేకసార్లు, తన దగ్గరి వ్యక్తుల్ని కూడా దూరం చేసుకున్నాడు. చర్చలు, వాదోపవాదాలతో కొత్త జవసత్వాలు వచ్చి ఉండవచ్చుగాని, ఆయనకు ఏకాంతంలో, పుస్తకాల సాంగత్యంలో గడపటమే ఇష్టం. ('పుస్తకాలు నా బానిసలు' అనేవాడు.) స్వభావరీత్యా మార్క్స్ అంతర్ముఖుడు. అయినా తన ఆత్మవిశ్వాసంతో, నాయకత్వ లక్షణాలతో ఎందర్నో ఆకర్షించాడు. రష్యన్ ఉదారవాది పావెల్ అన్నెకోవ్, మార్క్స్‌ను 'ప్రజాస్వామిక నియంత' అన్నాడు.

అయితే, జెన్నీ ఇందుకు పూర్తిగా భిన్నం. సొసైటీ జీవితం గురించి ఆమెకు బాగా తెలుసు. అందరిలో కలివిడిగా ఉంటుంది. ఆమె భర్తను చూసి భయపడేవాళ్లు కూడా ఆమెతో చనువు తీసుకొని మాట్లాడగలరు. ఆమె పక్కన ఉన్నప్పుడు మాత్రమే మార్క్స్ కాస్త 'రిలాక్స్‌డ్'గా కనిపించేవాడు. ఈ 'అడవి మనిషి'ని తాత్కాలికంగానైనా దారికి తీసుకురాగల ట్రెయినర్ జెన్నీ.

పారిస్ చేరేనాటికి, జెన్నీకి ఇరవై తొమ్మిది. మార్క్స్‌కు ఇరవై అయిదు. కొలోన్ రోజుల నుండీ, రచయితగా, జర్మన్ కాందిశీకులలో ఆయనకు మంచి గుర్తింపే ఉన్నది. కాని, అక్కడ ఇతర జర్మన్ ప్రముఖులతో పోల్చితే, ఆయన కీర్తి తక్కువే. కవి హెర్విగ్‌కు అంతకన్నా ఎక్కువ పేరుంది. ఆయన పుస్తకం, రాజకీయ కారణాల వల్ల నిషేధానికి గురైన తర్వాత, రాజుగారు ఫ్రీడ్రిక్ విల్హెమ్ – IV ఆయన్ను పిలిచి ప్రష్యా సాంస్కృతిక పునరుజ్జీవనంలో తన పాత్ర పోషించమని కోరాడు. కానీ హెర్విగ్ తన ప్రజాస్వామ్య వాదిననీ, రాజు గారికి సేవ చేయలేననీ బహిరంగ ప్రకటన చేశాడు. ఆ తర్వాత, కవిగార్ని ప్రష్యా నుండి బహిష్కరించారు. అలా, అనేక దేశాలు తిరిగి, పారిస్ చేరుకున్నాడు హెర్విగ్. ఊహించినట్టుగానే బహిష్కరణ తర్వాత ఆయన కీర్తి పెరిగింది. ఒక బెర్లిన్ సిల్క్ వ్యాపారి కూతుర్ని పెళ్లి చేసుకున్నాడు. (పెళ్లిలో మిఖైల్ బకూనిక్ 'బెస్ట్‌మాన్'గా వ్యవహరించాడు!) ఇక నవ జర్మనీ గళం తనే అనుకున్నాడు.

మార్క్స్ లాగ, హెర్విగ్ కూడా రూగ్ పత్రికకు రాయటానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు. 1840 నాటికి ధనికులు, కళాకారులను పోషించటం మానేశారు. గతంలో వాళ్ల చిత్రాలకూ, కవిత్వానికీ డబ్బులిచ్చేవారు. ఇప్పుడు 'పోషకాలు' లేక అందరూ రోడ్డున పడ్డారు. మార్క్స్ వీళ్లను 'మేధో కార్మికులు' అన్నాడు. పొట్ట చేత పట్టుకున్న కళాకారులు, సహజంగానే రాజకీయాల వైపు మొగ్గు చూపారు. ఒక రచయిత తమ రచనలన్నీ రాజకీయ అస్త్రాలే అన్నాడు. ఆనాటి కవులను

గురించే కాబోలు 'వీళ్లదో వింత జాతి. మనుషులకు అన్వయించే మంచి చెడులతో వీళ్లను బేరీజు వెయ్యలేం' అన్నాడు మార్క్స్.

హెర్వీగ్‌తో మార్క్స్ కలిసి వున్న కాలంలోనే ఒక జర్మన్ డాక్టర్, ఆయనకు హైన్రిష్ హైన్‌ను పరిచయం చేశాడు. కార్ల్ బాల్యం నుండీ హైన్, పారిస్‌లో కాందిశీకుడిగా బతుకుతున్నాడు. అతడు, ఆయనకు తల్లివైపు బంధువు. కార్ల్‌కన్నా ఇరవై ఏళ్లు పెద్ద. కార్ల్‌ది ఎవరితోనూ స్నేహం చేసే స్వభావం కానప్పటికీ ఇద్దరికీ మంచి దోస్తీ కుదిరింది. అయితే అప్పటికే, ఆయన ఆరోగ్యం పాడైంది. ఈ మృత్యువు ఎంతో దూరం లేదు. హైన్‌కు పరిచయస్తులలో గొప్ప 'అహంభావి'గా పేరుంది. అయినా త్వరలోనే మార్క్స్ దంపతుల ఇంట్లో ఒక సభ్యుడిగా మారిపోయాడు. వీళ్ల పరిచయం ఒకరకంగా ఇద్దరికీ

" పారిస్‌లో దానికి పాఠకులు లేరు. జర్మన్ సరిహద్దులో దాన్ని లోనికి రాకుండా అడ్డుకున్నారు. రూగ్, ఫ్రోబెక్ తమ పెట్టుబడులు ఆపేశారు. ఇక తాము వెనక్కు వెళ్లలేమోనన్న జెన్నీ భయాలు నిజమయ్యాయి. మార్క్స్, రూగ్, హైన్‌లు జర్మన్ గడ్డమీద కాలు మోపగానే అరెస్టు చెయ్యాలని ఆదేశించింది ప్రష్యన్ ప్రభుత్వం. వాళ్లమీద దేశ ద్రోహ నేరం మోపారు. "

లాభించింది. హైన్ రాజకీయాల అవసరం గుర్తించాడు. మార్క్స్ కళాత్మకంగా పరిణితి చెందాడు.

✧✧✧

ఫ్రెంచి జర్మన్ భాషల్లో రూగ్ నవంబర్ 1843 నుండి ప్రారంభించదలచుకున్న మాస పత్రికకు ఆర్థిక సమస్యలు అడ్డు పడ్డాయి. రాసేవాళ్ల కొరత మరో కారణం. ఒక్క ఫ్రెంచి రచయితా రాయటానికి అంగీకరించలేదు. రాయటానికి అంగీకరించిన ఒకే ఒక జర్మనేతర రచయిత రష్యన్ బకూనిక్ (అప్పటికతడు పారిస్‌లోనే ఉన్నాడు). ఫ్రెంచి రచయితలను వెతికి తెచ్చేపని మార్క్స్‌కు అప్పజెప్పాడు రూగ్. (ఫ్రెంచి రచయిత్రులు 'జార్జి సాండ్, ఫ్లోరా ట్రిస్టాన్ లాంటి వాళ్లను 'బొట్టు పెట్టి మరీ పిలవాలా?' అని కూడా ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. మార్క్స్‌కు ఈ ఇద్దరూ బాగానే తెలుసు. అయితే, ఆయన వాళ్లను పత్రికకు రాయమని అడిగాడా అనేది సందేహమే. మొత్తం మీద ఏ ఫ్రెంచి రచయితా

ఎంగెల్స్ 1841లో

పత్రికలో కనిపించలేదు. జర్మన్లు, ఫ్రెంచి తాత్విక భావనలను స్వాగతించారు గాని, ఫ్రెంచి వాళ్లు జర్మన్‌ల అభిప్రాయాల పట్ల ఉత్సాహం చూపించలేదు. 1789లో (ఫ్రెంచి విప్లవకాలం) తాము ఎదుర్కొన్న సమస్యలనే ఇప్పుడు జర్మన్లు ఎదుర్కొంటున్నారన్నది ఫ్రెంచి వాళ్ల భావన.

ఈ సమస్యలతో రూగ్‌లో కోపం, విసుగు పెరిగాయి. పత్రిక ప్రచురణ 1844 ఫిబ్రవరి దాకా వాయిదా పడింది. చివరికి, మార్కెట్లోకి మార్క్స్ సంపాదకత్వంలో అదో పుస్తకంలాగ, హెర్వీగ్, హైన్‌ల కవితలతో వచ్చింది. ఇవిగాక, జర్మనీలోని పరిస్థితులను విమర్శిస్తూ, రూగ్, మార్క్స్, ఫాయర్‌బాక్, బకూనిక్ రాసుకున్న లేఖలు, మోజెస్‌హెస్, బకూనిక్‌ల వ్యాసాలు, మార్క్స్ వ్యాసాలు రెండు, మరొకటి ఇంగ్లండులో వున్న జర్మన్ రాసిన వ్యాసం. ఆ రచయిత పేరు ఎంగెల్స్ – పత్రికను వెయ్యి ప్రతులు ముద్రించారు.

రూగ్ కొంతవరకు ప్రజాస్వామ్యవాది అయినప్పటికీ, మార్క్స్ తన పత్రికను రాడికల్ వ్యాసాలతో నింపటాన్ని సహించలేకపోయాడు. ముఖ్యంగా సాహిత్య మర్యాదలను అతిక్రమిస్తున్నట్టున్న ఆ శైలి మీద కోపం వచ్చింది. (మార్క్స్ శైలిని విమర్శించిన వాళ్లలో రూగ్ మొదటివాడు మాత్రమే. పేజీలకొద్దీ సాగే పేరాగ్రాఫులు, ఎవరికీ తెలియని సాహిత్య విషయాల గురించిన ప్రస్తావనలు, ఓ పట్టాన అర్థంకాని వాదనలు, పాఠకుడు అర్థం చేసుకుంటాడా లేదా అన్న విషయమే గమనించేవాడు కాదు మార్క్స్). తమకు బంగారు భవిష్యత్తు ఇస్తుందనుకున్న పత్రిక 'మొదటి సంచికతోనే మూత పడింది' అని గుర్తు చేసుకుంది జెన్నీ.

పారిస్‌లో దానికి పాఠకులు లేరు. జర్మన్ సరిహద్దులో దాన్ని లోనికి రాకుండా అడ్డుకున్నారు. రూగ్, ఫ్రోబెక్ తమ పెట్టుబడులు ఆపేశారు. ఇక తాము వెనక్కు వెళ్లలేమోనన్న జెన్నీ భయాలు నిజమయ్యాయి. మార్క్స్, రూగ్, హైన్‌లు జర్మన్ గడ్డమీద కాలు మోపగానే అరెస్టు చెయ్యాలని ఆదేశించింది ప్రష్యన్ ప్రభుత్వం. వాళ్లమీద దేశ ద్రోహ నేరం మోపారు.

ప్రష్యన్లకు కోపం తెప్పించినవి అందులోని రెండు మార్క్స్ రచనలు. అవి ఆయన హనీమూన్‌లో ఉన్నప్పుడే ప్రారంభించాడు. అందులో ఒకటి హెగెల్ మీది విమర్శ. మరొకటి పేరు 'ఆన్ ది జూవిష్ క్వొశ్చన్'. బెర్లిన్, కొలోన్‌లలో తను నేర్చుకున్న పాఠాలు ఆధారంగా అవి రాశాడు మార్క్స్. వాటిమీద ఫ్రెంచి తాత్విక భావాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. అంతేకాదు ప్రోలిటేరియట్ గురించిన చర్చ కూడా ఉంది. ప్రోలిటేరియస్ – లాటిన్ పదం. అందరికన్నా తక్కువ వర్గం లేదా ఆస్తి లేని వాళ్లు అని అర్థం. అయితే, మార్క్స్ దీన్ని 'సామాజిక మార్పు సృష్టించిన బాధితులు' అనే అర్థంలో వాడాడు. అంటే వీళ్లు మొదటి నుండీ పేదలు కాదు. పందొమ్మిదవ శతాబ్దిలో వచ్చిన పారిశ్రామిక విప్లవం ఫలితంగా – మనుషులు చెయ్యాల్సిన పనులు యంత్రాలు చెయ్యటంతో, కూలీనాలీ దొరక్క రోడ్డున పడ్డవాళ్లు. పురుషులకే కూలీ దొరకలేదంటే స్త్రీలు, పిల్లల పరిస్థితి మరీ అధ్వాన్నం. వెరసి, కూలీరెట్లు తగ్గి వాళ్లు బతకలేని పరిస్థితి ఏర్పడింది. ఇక, హెగెల్‌ను విమర్శిస్తూ, కేవలం సిద్ధాంత బలం మీద విప్లవం రాదు. అన్యాయానికి తిరగబడ్డ కార్మికవర్గం, విప్లవ సిద్ధాంతాన్ని ఆయుధంగా మలచుకుని ఉద్యమించినప్పుడే అది సాధ్యం అని స్పష్టం చేశాడు' ఈ విముక్తి కార్యాచరణకు తల... (మేధోశక్తి) తాత్విక సిద్ధాంతం. దీని ఆత్మ... కార్మికవర్గం.

సశేషం

▪ ఫోన్: 91776 18708

మనస్తత్వ విశ్లేషణే 'మధుపం'

ఈ కథల సంపుటిని 'అమృతలత'కి అంకితం చేశారు. తెలుగు యూనివర్శిటీ పాక్షిక ఆర్థిక సహాయంతో ముద్రించిన ఈ 'మధుపం'లో 23 కథలున్నాయి. వనిత, ఆంధ్ర సచిత్ర వార పత్రిక, చిత్ర, స్నేహ మాసపత్రిక, ప్రియదత్త, కథాకౌముది, స్వాతి, సురభి, జయంతి, రచన, ఆంధ్రభూమి, విపుల, నవ్య, ప్రఖ్యాతిగన్న పత్రికల్లో ప్రచురణైన కథలే ఈ సంపుటిలో ప్రచురించారు. వీరి కథల్లో సమాజ చిత్రణ, స్త్రీ అంతరంగ మథనం, మోసాలు, నేరాలు, పురుషుల మానసిక విశ్లేషణ ఈ కథల్లో ఓ సైక్రియాటిస్ట్‌లా కవయిత్రి విశ్లేషించారు. అన్ని కథలూ పాఠకుల్ని ఏకబిగువున చదివిస్తాయి. సమస్యలు ఏకరువు పెట్టడమేగాక



మధుపం (కథా సంపుటి),
కవయిత్రి : డి. కామేశ్వరి,
పేజీలు : 240- ధర : 150/-
ప్రతులకు : డి. కామేశ్వరి - (రచయిత్రి), 407, తిరుమల అపార్ట్‌మెంట్స్ - హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 20
సెల్ : 9247331446.

పరిష్కారాలు కథాకథనాల్లో చెప్పడం విశేషం. టీనేజ్ పిల్లల పెంపకంలో భార్యాభర్తల పాత్రల తీరు చక్కగా 'మధుపం'లో కవయిత్రి విశ్లేషించారు. ఎస్.ఎమ్.ఎస్‌లు ఐప్యాడ్‌లు, ఫేస్‌బుక్‌లు, కాల్‌సెంటర్లు కథీకరించడం బాగుంది. భార్యను పట్టించుకోని భర్తలో మార్పు రావడం... సినిమాలకు కోరకుండానే తీసుకెళ్లడం... లాంటి పనుల వెనుక మర్మం తెలుసుకోవాలంటే 'వడ్లగింజలో బియ్యపుగింజ' చదవాలి. అన్ని కథల్లో మానవీయ సంబంధాలు చెప్పారు. నేర సామ్రాజ్యంలో పావులుగా పేదలే ఉంటారు. తెరవెనుక అసలు నేరస్తుల్ని వదలి సామాన్యుల్ని ఎరగా వాడే వైనాన్ని - పోలీసుల తీరుతెన్నులు... తన చదువుకై తల్లి పడే కష్టాలు..చక్కగా చెప్పి.. పాఠకుల్ని ఆలోచింపజేసే కథ 'తప్పెవరిది'. అర్థశతాబ్దికి పూర్వమే రచయిత్రిగా డి. కామేశ్వరి ప్రసిద్ధికెక్కారు. ఇది ఆమె పదకొండో కథా సంపుటి. 1962 నుంచి కథలు- నవలలు రాస్తున్న కామేశ్వరిగారు ఇప్పటికి 300 కథలు : 21 నవలలు, ఒక యాత్రా రచన, ఒక కవితా సంపుటి ప్రచురించారు. వీరి రచనలు : కన్నడం, తమిళం, హిందీ ఇంగ్లీషు భాషల్లోకి అనువాదమైనాయి. న్యాయం కావాలి, కోరికలే గుర్రాలైతే కథలు సినిమాలుగా వచ్చాయి. చాలా కథలు : స్త్రీల సమస్యల ఆధారంగా రాసినవే. వీరి కథా రచనలో సామాజిక ప్రయోజనం, నీతి, సాంఘిక కట్టుబాట్లు, సాంఘిక ఆర్థిక స్థితిగతులు... సాంకేతికత- నైతిక విలువలకు ప్రాధాన్యత వీరి కథల్లో కనిపిస్తాయి. కవయిత్రి కలం - కాలంతోపాటు కదలడం అభినందనీయం.

- తంగిరాల చక్రవర్తి

ప్రజల చరిత్ర

అధికారిక చరిత్రకారులు పాలకుల చరిత్రను, పాలకవర్గాల చరిత్రను మాత్రమే నమోదు చేస్తారు. ప్రజల దృష్టితో ఆలోచించే చరిత్రకారులు ప్రజల ప్రయోజనాల, మెజారిటీగా శ్రామికవర్గ ప్రయోజనాల ప్రాతిపదికన చరిత్రను విశ్లేషిస్తారు. మనకు తెలిసిన అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్ర అంతా అక్కడి పాలకవర్గాల చరిత్రే. దానికి పూర్తి భిన్నంగా అమెరికా చరిత్రను రాజకీయ, ఆర్థిక అధికార వ్యవస్థల వెలుపల ఉండేవారు ఎలా భావించారో, అనుభవించారో హొవార్డ్ జిన్ 'పీపుల్స్ హిస్టరీ ఆఫ్ యునైటెడ్ స్టేట్స్' (అమెరికా ప్రజల చరిత్ర) అనే ఈ గ్రంథంలో వివరించారు. మూలవాసులు, బానిసలు, స్త్రీలు, నల్లజాతివారు, శ్రామికులు - ఇలా విస్తృత ప్రజానీకం కోణం నుండి అమెరికా చరిత్రను వీక్షించి అపూర్వమైన గ్రంథాన్ని ఆయన అందించారు. 1922 డిసెంబరులో ఓ కార్మికవర్గ కుటుంబంలో జన్మించిన హొవార్డ్ జిన్ ద్వితీయ ప్రపంచ సంగ్రామంలో



అమెరికా ప్రజల చరిత్ర, హొవార్డ్ జిన్,
పేజీలు : 294, ధర: రూ. 150/-,
ప్రతులకు : 1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 27608107.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్నీ బ్రాంచీలలో లభిస్తాయి

పాల్గొన్నారు. ఆనాడు యుద్ధ భీభత్సాన్ని స్వయంగా చూసినవాడు కావడంతోనే ఆయన ఆ తర్వాత యుద్ధ వ్యతిరేక ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. 1956లో అట్లాంటాలోని స్పెల్‌మన్ కాలేజీలో పొలిటిక్స్ ప్రొఫెసర్‌గా చేరిన జిన్ నల్లజాతి పౌరహక్కుల ఉద్యమంతో సహా పలు నిరసనోద్యమాల్లో పాల్గొంటుండేవాడు. ఫలితంగా ఆయనను 1963లో ఉద్యోగం నుండి తొలగించారు. తర్వాత బోస్టన్ యూనివర్శిటీలో చేరి వియత్నాం యుద్ధ వ్యతిరేకోద్యమంలో ప్రముఖ పాత్ర వహించారు. విశ్వవిద్యాలయంలో సైతం అక్కడి కార్మికుల తరపున నిలబడి పోరాడారు. ఇరాక్‌లో అమెరికా జోక్యందారీ యుద్ధాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. 1988లో పదవీ విరమణ చేసిన తర్వాత కూడా పూర్తి క్రియాశీలకంగా ఉన్నారు. పలు గ్రంథాలు, లెక్కలేనన్ని వ్యాసాలు రచించారు. 2010 జనవరిలో కాలిఫోర్నియాలోని శాంటామోనికాకు ఒక ఉపన్యాసం ఇచ్చేందుకు వెళ్లి స్విమ్మింగ్ చేస్తూ గుండెపోటుతో మరణించారు.

1988లో ప్రథమ ముద్రణ పొందిన 'అమెరికా ప్రజల చరిత్ర' 2003 నాటికే పది లక్షల కాపీలు అమ్ముడుపోయి, ఆ తర్వాత సైతం ఏడాదికి లక్ష కాపీల చొప్పున అమ్ముడుపోతూ వచ్చిందంటేనే దానికి ఉన్న ప్రాధాన్యత ఎంతో అర్థం చేసుకోవచ్చు. 2002లో ఆంథోనీ ఆర్నోవ్‌తో కలిసి 'వాయిసెస్ ఆఫ్ ఎ పీపుల్స్ హిస్టరీ ఆఫ్ యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా' (అమెరికా ప్రజాగళాలు) అనే సహ గ్రంథాన్ని కూడా వెలువరించారు. దీనిలో అప్పటి ప్రజల మనోభావాలను వెల్లడించే వ్యాసాలను, పాటలను, పద్యాలను, ప్రసంగాలను పొందుపరిచారు.

ఇంతటి గుర్తింపు పొందిన (అమెరికా ప్రజల చరిత్ర) గ్రంథాన్ని ప్రజాశక్తి బుక్‌హౌస్ సంక్షిప్తంగానే అయినా మొట్టమొదటిసారి తెలుగులో అందిస్తోంది. 'అమెరికా ప్రజా గళాలు' గ్రంథంలో భాగాలను కూడా ఇందులో అనుబంధంగా అందిస్తున్నారు. ఈ రెండు గ్రంథాల సంక్షిప్తీకరణను 'థర్డ్ వరల్డ్ ట్రావెలర్' వెబ్‌సైట్ నుండి స్వీకరించారు. బి. భాస్కర్, సత్యరంజన్ అనువదించారు.

- స్నేహ

ఐ యామ్ అలీ

'ఐ యామ్ అలీ'! విశ్వవిఖ్యాత బాక్సర్ మహ్మద్ అలీ జీవితం ఆధారంగా తీసిన చిత్రం. ఆ సినిమా ప్రివ్యూకు అలీ మినహా బంధుమిత్రులంతా హాజరయ్యారు. అక్కడికి హాజరైన వారందరిలోను ఒకటే సందేహం. 'అలీ ఎందుకు రాలేదు?' అని. అప్పుడు చెప్పారు ఆయన సోదరుడు రెహ్మాన్... 'తను జబ్బు పడ్డాడు. ఎక్కువగా మాట్లాడలేని...కదలలేని స్థితిలో వున్నాడు. కానీ మనందరం అతనికోసం ఇక్కడ హాజరైనందుకు గర్విస్తాడు...' అని. ఈ చిత్రం గతవారం అమెరికాలో విడుదలైంది. త్వరలో బ్రిటిష్ సినిమా హాళ్లలోనూ విడుదల కానుంది. ఈ సందర్భంగా ... క్రీడాకారుడిగా, మానవ హక్కుల కార్యకర్తగా, శాంతి దూతగా... ఎందరికో స్ఫూర్తినిస్తున్న అలీపై ప్రత్యేక కథనం...

మహ్మద్ అలీ... పేరు చెప్తే చాలు! బాక్సింగ్ రింగ్‌లో ప్రత్యర్థులకు చెమటలు పట్టేవి. శక్తిమంతమైన పంచ్‌లతో ఈ శతాబ్దపు బాక్సర్‌గా ప్రశంసలందుకొన్నాడు. నిజానికి మహ్మద్ అలీ అసలు పేరు క్లాసియస్ మర్సిలస్ క్లే జూనియర్. తనది ఆఫ్రికన్-అమెరికా మధ్య తరగతి కుటుంబ నేపథ్యం. 12 ఏళ్లకే బాక్సింగ్ సాధన ప్రారంభించాడు. లూయిస్ విల్లేకు చెందిన పోలీస్ ఆఫీసర్, బాక్సింగ్ కోచ్ 'జోయ్ ఈ మార్టిన్' తొలుత అలీ ప్రతిభను గుర్తించి శిక్షణ ఇచ్చాడు. మార్టిన్ శిక్షణలో రాటుదేలిన అలీ ఆరు కెంటుక్యీ గోల్డెన్ గ్లోవ్స్ టైటిల్స్, రెండు నేషనల్ గోల్డెన్ గ్లోవ్స్, అథ్లెటిక్స్ యూనియన్ టైటిల్స్ సొంతం చేసుకున్నాడు. మూడుసార్లు ప్రపంచ హెవీ వెయిట్ ఛాంపియన్‌గా నిలిచిన ఏకైక బాక్సర్‌గా చరిత్ర సృష్టించాడు. తాను బాక్సింగ్ ఆడిన కాలంలో దాదాపు ప్రతి ఒక్క బాక్సర్‌ను ఓడించిన ఘనత కూడా మహ్మద్ అలీకే చెల్లింది.

వివక్షకు నిరసగా..

బాక్సింగ్‌లో అనితర సాధ్యమైన విజయాలెన్నో సొంతం చేసుకున్న మహ్మద్ అలీ ... జాతి, వర్ణ వివక్షకు గురయ్యాడు. 1960 రోమ్ సమ్మర్ ఒలింపిక్స్‌లో లైట్ హెవీ వెయిట్ విభాగంలో స్వర్ణం సాధించాడు. స్వర్ణ పతకంతో అమెరికాకు తిరిగొచ్చాక...తన స్నేహితుడితో కలిసి ఓ రెస్టారెంట్‌కు వెళ్లాడు. తెల్ల జాతీయులకు మాత్రమే సర్వీస్ చేస్తామని రెస్టారెంట్ సిబ్బంది అలీకి సర్వీస్ నిరాకరించారు. ఈ ఘటనతో చలించిపోయి ..రోమ్ స్వర్ణ పతకాన్ని ఒహియో నదిలో విసిరేశాడు. ఈ విషయాన్ని 1977లో వచ్చిన తన ఆత్మకథలో మహ్మద్ అలీ స్వయంగా పేర్కొన్నాడు (అయితే 1996 అట్లాంటా ఒలింపిక్స్‌ను ప్రారంభించిన అలీకి.. మరో మెడల్‌ను బహూకరించారు ఒలింపిక్స్ నిర్వాహకులు.).

నిషేధంలో నాలుగేళ్లు

మహ్మద్ అలీకి బాక్సింగ్ దిగ్గజంగా ఎంత పేరుందో ... జాతి, వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన వాడిగానూ అంతటి గుర్తింపు పొందాడు. ఆరోజుల్లో నల్ల జాతీయులు సాధించిన విజయాలు, రికార్డులకు సామాజికంగా ఎలాంటి గుర్తింపు ఉండేది కాదు. మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ ప్రేరణతో మహ్మద్ అలీ కూడా జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాడాడు. ఈమధ్య కాలంలోనే తన పేరును మహ్మద్ అలీగా మార్చుకున్నాడు. వియత్నాంలో అమెరికా యుద్ధం చేస్తున్న సమయంలో అమెరికన్ సైన్యంలో చేరేందుకు మహ్మద్ అలీ నిరాకరించాడు. సైన్యంలో చేరాలంటే అల్లా ఆజ్ఞాపించాలనే సంచలన వ్యాఖ్యలు కూడా చేశాడు అలీ. వీటి వల్ల అమెరికా కోపాన్ని కూడా చవిచూడాల్సి వచ్చింది. అగ్రరాజ్యం అలీ పాస్‌పోర్టును రద్దు చేసింది. వియత్నాంతో అమెరికా యుద్ధం ఏమాత్రం న్యాయసమ్మతం కాదని బాహాటంగా వ్యాఖ్యానించాడు మహ్మద్ అలీ. అందుకు ఆగ్రహించిన అమెరికా ప్రభుత్వం ... సైన్యంలో చేరేందుకు నిరాకరించాడన్న అభియోగం మోపటంతో పాటు అతనిపై నిషేధం విధించింది. అన్యాయంగా తనపై నిషేధం విధించటం పట్ల ఏమాత్రం కలత చెందని మహ్మద్ అలీ ధైర్యంగా సుప్రీంకోర్టులో కేసు వేశాడు. ఆ వాదనతో ఏకీభవించిన అత్యున్నత న్యాయస్థానం... అతనిపై విధించిన నిషేధం అక్రమమని తేల్చింది. నిషేధం కారణంగా వచ్చిన నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత కూడా... తన పంచ్ వాడి వేడి తగ్గలేదని నిరూపించుకున్నాడు.

బాక్సింగ్ కింగ్

మహ్మద్ అలీ బాక్సింగ్ రింగ్‌లోకి మకుటం లేని మహరాజు. మూడు సార్లు హెవీ వెయిట్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన ఘనత సొంతం చేసుకున్న యోధుడు. పద్దెనిమిదేళ్ల ప్రాయంలో (1960) బాక్సింగ్‌లో రింగ్‌లోకి దిగిన మహ్మద్ అలీ, 40 ఏళ్ల వయసులో (1981) ఆఖరి ఫైట్ చేశాడు. తన కెరీర్‌లో 61 ఫైట్స్ చేసిన మహ్మద్ అలీ కేవలం 5 ఫైట్స్‌లో మాత్రమే ఓటమి చెందాడు. బాక్సింగ్ రింగ్‌లోకి అడుగుపెట్టిన దశాబ్దం తర్వాత గానీ మహ్మద్ అలీ తొలి ఓటమిని చూడలేదంటేనే అతగాడి పంచ్ ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. మహ్మద్ అలీ సాధించిన 56 విజయాల్లో 37 ఫైట్స్ నాకౌట్ కావట విశేషం (ఫైట్ పూర్తవ్వక ముందే ప్రత్యర్థి చేతులెత్తేయటం).

ఫైట్ ఆఫ్ ది సెంచరీ

శతాబ్దపు ఫైట్‌గా బాగా ప్రాచుర్యంలోకి వచ్చిన ఫైట్ ఒకటి వుంది. అమెరికాకు చెందిన మరో ప్రొఫెషనల్ బాక్సర్ జోయ్ ఫ్రెజిర్‌తో మహ్మద్ అలీ తలపడిన మ్యాచ్ ఇది. న్యూయార్క్‌లోని మాడిసన్ స్క్వేర్ దీనికి వేదికైంది. ఇద్దరు దిగ్గజాలకు మధ్య జరుగుతున్న మ్యాచ్ కావటంతో ఈఫైట్ టికెట్లు హాట్‌కేకుల్లా అమ్ముడయ్యాయి. ఆ రోజుల్లోనే తృతియ శ్రేణి టికెట్‌ను పదివేల రూపాయలకు అమ్మారు నిర్వాహకులు. పదిహేను నిమిషాల పాటు సాగిన చారిత్రక ఫైట్‌లో జోయ్ ఫ్రెజిర్ విజయం సాధించాడు. ఇదే మహ్మద్ అలీ కెరీర్‌లో చవిచూసిన తొలి ఓటమి. ఈమ్యాచ్ ద్వారా ఫ్రెజర్, అలీలు చెరో 2.5 మిలియన్ల అమెరికన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించారు.

అలీ వారసురాలు లైలా

మహ్మద్ అలీకి తొమ్మిది మంది సంతానం. ఏడుగురు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు. ఏడుగురు అమ్మాయిల్లోకెల్లా అందరికంటే చిన్నమ్మాయి లైలా అలీ తండ్రి బాటలో నడిచింది. దిగ్గజ బాక్సర్ వారసురాలిగా బాక్సింగ్ రింగ్‌లోకి అడుగుపెట్టిన లైలా అలీ..గెలుపు పంచ్‌లోనూ తండ్రిని మించిపోయింది. ఇప్పటి వరకు 24 ఫైట్స్ చేసిన లైలా అలీ..21 ఫైట్స్‌లలో నాకౌట్‌తో నెగ్గింది. ఓటమెరుగని మహిళా బాక్సర్‌గా కీర్తి గడించింది.

అవార్డులు

బాక్సింగ్ రింగ్‌లో ప్రత్యర్థులను గడగడలాడించిన మహ్మద్ అలీ ఎన్నో అవార్డులు మరెన్నో రివార్డులు అందుకున్నాడు. మానవ హక్కుల కార్యకర్తగా, ఐక్యరాజ్య సమితి శాంతి దూతగా సేవలందించిన మహ్మద్ అలీని అమెరికా ప్రభుత్వం 'ప్రెసిడెంట్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్' అవార్డుతో సత్కరించింది. అలాగే ప్రెసిడెన్షియల్ సిటిజన్ మెడల్‌ను కూడా అందుకున్నాడు. బిబిసి 'స్పోర్ట్స్ పర్సనాలీటి ఆఫ్ ది ఇయర్' అవార్డును అందించింది. ఒట్టో హాన్ పీస్ మెడల్ ఇన్ గోల్డ్‌తో ఐరాస అసోసియేషన్ ఆఫ్ జర్మనీ ఘనంగా సన్మానించింది. ప్రిన్స్‌టన్ యూనివర్శిటి 260 స్నాతకోత్సవం సందర్భంగా మహ్మద్ అలీకి గౌరవ డాక్టరేట్ అందించింది.

అలీ కేరాఫ్ కథావస్తువు

మహ్మద్ అలీ బాక్సింగ్ ఆడిన రోజుల్లో మీడియాకు మంచి వార్తా వస్తువుగా నిలిచాడు. ఆటతో, వివాదాలతో అలీ పతాకశీర్షికలుగా మారాడు. మహ్మద్ అలీ ఇతివృత్తంగా వచ్చిన పుస్తకాలు, డాక్యుమెంటరీలు, సినిమాలు సూపర్ హిట్ కోవలోకి చేరాయి. స్పోకెన్ వర్డ్ పేరిటి విడుదలైన కొలంబియా రికార్డు పుస్తకం అప్పట్లో సంచలనం సృష్టించింది. ప్రతిష్టాత్మక స్పోర్ట్స్ ఇల్లస్ట్రేటెడ్ మ్యాగజన్ 37 సంచికలు మహ్మద్ అలీ ముఖచిత్రంతో ప్రచురితమయ్యాయి. బాస్కెట్ బాల్ దిగ్గజం మైఖల్ జోర్డాన్ తర్వాత ఈఘనత సొంతం చేసుకున్న క్రీడాకారుడు అలీ. అతని ఆత్మకథ ఆధారంగా తీసిన 'ది గ్రేటెస్ట్' చిత్రం బాగా ఆడింది. 'బ్లాక్ రోడియో' డాక్యుమెంటరీలోని అలీ నటన అభిమానులను ఆకట్టుకుంది. బానిస జీవితంపై చిత్రించిన 'ఫ్రీడమ్ రోడ్'లో అలీ అభినయానికి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. టీవీ షోలో కూడా అలీ తనదైన ముద్ర వేశాడు. వియత్నాంపై యుద్ధం సమయంలో అమెరికాను ఎదిరించిన సందర్భంపై కూడా ఓ డాక్యుమెంటరీ రూపొందింది. 'స్టాండ్ బై మీ' పాటతోనూ అలీ అభిమానులను అలరించాడు. ఇక అలీ వాడిన గ్లోవ్స్ అంటే ఇప్పటికే క్రేజ్ వుంది. వివిధ ఫైట్లలో అతను వాడిన గ్లోవ్స్ వేలంలో కోట్ల రూపాయల ధర పలికాయి. 'ఫైట్ ఆఫ్ ది సెంచరీ' సందర్భంగా ఉపయోగించిన గ్లోవ్స్ రికార్డు స్థాయిలో రూ.రెండు కోట్ల 40 లక్షలకు ఓ అభిమాని సొంతం చేసుకున్నాడు.

బాక్సర్‌గా శిఖరాగ్రానికి చేరుకున్న మహ్మద్ అలీ అంతటితో తన పోరాటాన్ని ఆపలేదు. సామాజిక అంశాలపైనా పోరాడి అభిమానుల హృదయాల్లో ఈశతాబ్దపు యోధుడిగా గుర్తింపు పొందాడు.

గత 30 ఏళ్లుగా పార్కిన్సన్ వ్యాధితో పోరాడుతున్నాడు. బాక్సర్లకు సాధారణంగా వచ్చే వ్యాధి ఇది. దీని మూలంగా కదల్లేని స్థితిలో నిస్తేజంగా వున్నాడు. ఉదయపు వేళల్లో మాత్రమే కొన్ని సంజ్ఞల ద్వారా మాట్లాడగలుగున్నాడని సమాచారం. పదిహేనేళ్ల మనవడు జాకబ్‌తో స్కైప్‌లో మాట్లాడటం ఒక్కటే ఇప్పుడాయనకు అందుతున్న చిరు సంతోషం. ప్రత్యర్థుల పిడిగుద్దుల బారిన పడి..ఇలా వృద్ధాప్యంలో నరకయాతన అనుభవిస్తున్న బాక్సర్లు లెక్కకు మించి ఉన్నారంటే ఆశ్చర్యం వేస్తుంది.

'ఛాంపియన్లు ... శిక్షణ కేంద్రాల్లో, జిమ్ములలో తయారు కారు. ఓ బలమైన ఆశయం, కల, దృక్పథంలో నుంచి ఉద్భవిస్తారు. కళ, సాధించాలనే తపన ప్రస్ఫుటంగా కనిపించాలి. కాని కళ కంటే బలంగా.. సాధించాలనే తపనే ఉండాలి' అన్న మహ్మద్ అలీ మాటలు నేటి తరం క్రీడాకారులందరికీ మార్గదర్శకాలు.

-శ్రీనివాస్ దాస్ మంతటి



భార్య బిడ్డతో



అలీ గ్లోవ్స్

బుష్‌తో అలీ

కుమార్తె లైలాతో అలీ



రీల్... రియాలిటీ!

చెట్టు ముందా విత్తు ముందా? వెండి తెరనూ బుల్లి తెరనూ నిజ జీవితం నిర్దేశిస్తున్నదా లేక తెర జీవితమే నిజంగా మారుతున్నదా? రీల్ లైఫ్‌కూ రియల్ లైఫ్‌కూ మధ్య గీత ఎక్కడ చెరిగిపోతున్నది? జీవితంలో నీతులూ బూతులూ తెరపై ఎలా ప్రతిబింబిస్తున్నాయి? తెరపై రీతులూ రోతలూ వికృతులూ జీవితంలోకి ఎలా ప్రవేశిస్తున్నాయి? మిగిలిన విషయాలు అలా వుంచి మహిళల గౌరవ ప్రతిష్టలనూ వ్యక్తిత్వాన్ని శక్తి యుక్తులనూ ఈ తెర జీవితం ఎలా చెర పడుతున్నది? సామాజిక వేత్తలనూ పరిశీలకులనూ కలవర పెడుతున్న ప్రశ్నలివి. కల్లోల పరుస్తున్న కఠిన సత్యాలివి.

- తెలకపల్లి రవి

కుటుంబ విలువల పరిధిలో భర్తలను సేవించడమే పరమార్థమన్నట్టు నాయికపాత్రలను చిత్రించిన సినిమాలు మొదట్లో చాలా వచ్చాయి. భారత నారి భావనను బలపర్చడం అమితంగా జరుగుతుండేది. అయితే ఇలాంటి ధోరణులున్నా సినిమాలు, సీరియళ్లు ఒకప్పుడు మహిళలకు ప్రేరణగా వుండేది. భూస్వామ్య సమాజపు విలువల మధ్యనే నవీన యువతి రూపుదాలుస్తున్న సూచనలుండేవి. ఈ చిత్రాల మధ్య ఎక్కడన్నా కాస్త ఆధునికమైన వస్త్ర ధారణా తిరుగుబాట్లు, ధిక్కార స్వరాలూ కనిపిస్తే విపరీతమైన ప్రభావం ప్రసరించేవి. నర్గీస్, మీనా కుమారి, వహీదా రెహమాన్, హేమమాలిని, భానుమతి, సావిత్రి, వాణిశ్రీ, తర్వాత శారద వంటి నాయికల పాత్రలు ఈ రెండు ధోరణులకూ నమూనాలుగా వుండేవి. చదువుకుంటున్న అమ్మాయిలు వారిలాగా వస్త్ర ధారణ, సంభాషణ, నడక చేయాలని ఆరాటపడేవారు. అసలు భా రతీయ చిత్రాలకు రెండే ఇతివృత్తాలు- స్త్రీని గౌరవంగా చూపించడం లేదా అగౌరవ పర్చడం అని విశ్లేషకులంటుండేవారు. సినిమాల్లో నాయికల పాటలు క్లబ్బు డాన్సులనబడే అశ్లీల నృత్యాలూ విడివిడిగా వుండేవి. విలన్లు మాత్రమే వాటిలో పాల్గొనేవారు. హీరో గుణపాఠం చెప్పడానికి మాత్రమే అక్కడకు వెళ్లేవాడు. అదీ గతంలో పరిస్థితి. పాతివ్రత్యపు పాదసేవ విలువల మధ్యనే కథానాయకుడిని కూడా తీర్చిదిద్దే బలీయమైన నాయిక పాత్రలుండేవి. వాటిని హీరోయిన్ ఓరియంటెడ్ సినిమాలనే వారు. ఎన్టీఆర్ ఏఎన్నార్ ఇద్దరూ నటించిన సినిమాకు 'మిస్సమ్మ' అని నాయిక పేరు పెట్టడం ఇందుకో ఉదాహరణ మాత్రమే. 'అర్ధాంగి' కూడా అలాటి పేరే. ఉదాహరణకు 'అర్ధాంగి'లో సావిత్రి పిచ్చివాడైన భర్తను చక్కదిద్ది దారికి తెచ్చుకుంటుంది. 'బాటసారి'లో భానుమతి దుర్బలమనస్కుడైన నాయకుణ్ని ఆదరించి దూరమవుతుంది. హీరోలకు అధిక పారితోషికం ఇచ్చినా హీరోయిన్‌కు కూడా తగు ప్రాధాన్యత వుండేది. భానుమతి, సావిత్రి, జమున వంటి ప్రసిద్ధ నాయికలుండేవారు. భానుమతి, అంజలి వంటి వారు స్వయంగా చిత్రాల నిర్మాతలుగా ఒక మెట్టు పైనే వుండేవారు కూడా. నిజజీవితంలో కన్నా సినిమాల్లో ప్రేమలూ యుగళ గీతాలు అసహజంగా అధికంగా వున్నా ఎబ్బెట్టుగా జుగుప్స గొల్పేవిగా మారకుండా కొంత జాగ్రత్త పడేవారు. రాక్సీలో నార్మా షేరర్, బ్రాడ్వేలో కాంచనమాల అని శ్రీశ్రీ ఎనభై ఏళ్లకిందట రాశాడంటే అప్పటి నాయికలను కూడా ఆకర్షణీయంగా చూపించలేదని కాదు. అసభ్య చిత్రాలు దృశ్యాలు తీసే ప్రయత్నాలు జరగలేదని కాదు. ఆ మాటకొస్తే గొప్పగా చెప్పుకునే సంప్రదాయ సంస్కృతిలోనే దేవదాసీలు, మేజువాణిలు, జోగినీలు వుండటం మనకు తెలుసు. కందుకూరి వీరేశలింగం వంటి వారు మేజువాణిలపై ఎంతగా పోరాడవలసి వచ్చిందీ కూడా తెలుసు. నిజానికి వీటిని భోగం డాన్సులనే వారు. పిల్లలు యువతీ యువకులు అటు పోకుండా ఆపేందుకు తంటాలు పడేవారు. మరో వంక పెద్ద మనుషులుగా చలామణి అయ్యేవారే అక్కడ చేరి పైసలు విసురుతూ వెకిలి సైగలు చేస్తూ ఆ డాన్సులను ప్రోత్సహించేవారు. ఆ దశ తర్వాత చాలా దశాబ్దాలకు వచ్చిన సినిమాల్లో వాటి పొడ అసలు లేకుండా పోతుందని కాదు. అయితే అందుకు కొన్ని పరిమితులుండేవి. వాటి మధ్య ఒక గీత వుండేది. ఇంట్లో ఇల్లాలి పాత్రను ఒక విధంగా చూపించి వారి దృష్టిలో వెలయాలి పాత్రను మరో

విధంగా చూపించేవారు. ఇప్పుడు అవన్నీ చెరిపేస్తున్నారనిపిస్తుంది. ఈ నేపథ్యంలోనే సినిమాలు చూసి సమాజం పాడై పోతున్నదా లేక సమాజాన్నే సినిమాలు అతిగా చూపిస్తున్నాయా అని మీమాంసలు వినిపిస్తాయి. ఇప్పుడు ఇరవై నాలుగు గంటల ఛానళ్ల వచ్చాయి. అహోరాత్రాలు సెకనులో మిలియన్ వంతు కూడా వదలకుండా ఏదో ఒకటి చూపిస్తున్నాయి. అందులోనూ హాట్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు పెద్ద పీట వేస్తున్నాయి. సినిమా హాలుదాకా వెళ్లాల్సిన శ్రమ లేకుండా అవే మన నట్టింట్లోకి నడిచొస్తున్నాయి. వీటినే వీడియో క్యాసెట్లుగా అందించడంతో పాటు ఇప్పుడు ఏకంగా సెల్‌ఫోన్లలో కూడా చూసుకునే వెసులుబాటు వచ్చేసింది. మొత్తం సినిమాతో సంబంధం లేకుండా కావాలనుకున్న సన్నివేశాలనే తీసి పంపిణీ చేసే అవకాశం ఏర్పడింది. వాటిలో అచ్చంగా మిడ్‌నైట్ మసాలాల వంటి కార్యక్రమాలే వుంటున్నాయి. రియాల్టీ షోలలో అమ్మాయిలను సినిమాలకు తీసిపోని విధంగా చూపించే వికృతి పెరిగింది. ఇక రియాల్టీ షోలలో జడ్జిల నుంచి కళాకారుల వరకూ ఎవరైనా ఏదైనా విశృంఖలంగా మాట్లాడితే వినోదమై పోతున్నది. యాంకర్‌గా మాత్రం కాస్త నదురుగా వుండే అమ్మాయిని పెట్టి ఆ పైన అబ్బాయిలే అమ్మాయిల వేషం కట్టి అసహ్యంగా మాట్లాడటం అలవాటుగా మారిపోయింది. బుల్లితెర వ్యవహారమే ఇంత జోరుగా వుంటే పెద్ద తెర లేదా వెండి తెర వెనకబడి వుంటుందనుకోగలమా? రేడియో జాకీలు కూడా 'ఇది చాలా హాట్ గురూ' అని నొక్కి నొక్కి చెబుతుంటే కాసుల కోసం కక్కుర్తికి మారుపేరైన చవకబారు అభిరుచులు పురి విప్పకుండా వుంటాయా? అంతటి అడ్డగోలు అశ్లీలాన్ని చూసిన చూస్తున్న సమాజం అగ్నిహోత్రంలా వుంటుందా? కనుక ఏది నిజం ఏది కల్పన అన్న ప్రశ్నకు ఆస్కారమే లేకుండా తెర మీద దృశ్యాలన్నీ చెరలుగా మారి మహిళల గౌరవాన్ని మంటగలుపుతున్నాయి.

అలంకారం.. అతి వికారం..

ఇప్పుడు వచ్చే అత్యధిక చిత్రాల్లో కథానాయక కేవలం ఒక అలంకారం. అవసరం. ప్రధాన కథలో ఎక్కడా తన ప్రభావం వుండదు. ఆ పాత్రను తీసేసినా కలిగే నష్టమూ వుండదు. ఆ పాత్ర ఫలానా వారే వేయాలన్న పరిస్థితీ వుండదు. ఎందుకంటే నాయికల స్త్రీత్వాన్ని ఆరబోసి సొమ్ము చేసుకోవడం తప్ప వ్యక్తిత్వాన్ని శక్తిత్వాన్ని ఆవిష్కరించే ఆలోచనే మన దర్శక నిర్మాతలకు వుండదు. ఉదాహరణకు ఘన విజయం సాధించిన 'అతడు' సినిమా తీసుకోండి.. అందులో త్రిష పాత్ర లేకపోతే ఏమైనా లోపం జరుగుతుందా? అందుకే శక్తిహీనమై రక్తి ప్రధానమైన ఇలాటి నాయిక పాత్రలు ఒకటి చాలక రెండూ మూడూ ప్రవేశపెడుతుంటారు. 'అత్తారింటికి దారేది', 'జల్సా', ఏ సినిమా తీసుకున్నా సరే ఇదే తంతు. నేరస్తులకు సింహస్వప్నం అనుకునే 'గబ్బర్ సింగ్' శ్రుతిహసన్ వంటి యువతి వెంట పడి ఏడిపిస్తుంటాడు. ఇక ఈ అమ్మాయిలు కేవలం హీరోలతో ఏడిపించబడటానికి, కలలు కనడానికి, కండలు చూసి కాగిపోవడానికి మాత్రమే ఉద్దేశితులు. పైగా చిత్రం పొడుగునా వారిని హీరో అడ్డమైన మాటలూ అంటుంటాడు. వారి శరీరాన్ని వర్ణిస్తూ వుంటాడు. వాటన్నిటినీ హాయిగా స్వీకరిస్తూ మగాడు మగాడు అంటూ వారి వెంటపడినట్టు చూపిస్తుంటారు. రవి తేజ వంటి నటుడు అడ్డగోలుగా మాట్లాడినా ఆనందంగా భరిస్తుంటారు. అంతేగాని చాచిపెట్టికొట్టరు. అల్లు అర్జున్ 'దేశముదురు', 'పరుగు' వంటి చిత్రాలు చూడండి- నాయిక సమస్యల్లో వున్నా నాయకుడు వేధించి మరీ ప్రేమించానంటాడు. 'జల్సా'లోనైతే అక్కా చెల్లెళ్లు ఇద్దరూ ఒకన్నే ప్రేమిస్తుంటారు. కేవలం తుపాకీతో కాల్చడానికే హీరో అన్నట్టు వుండే మహేష్ బాబు చిత్రాలలో కూడా ఇలియానా వంటి నాయికలు వారి చుట్టూ తిరుగుతుంటారు. రజనీకాంత్ 'శివాజీ' అయితే శ్రియ లాటి యువ నటి, 'రోబో' అయితే అందాల రాణి ఐశ్వర్యా రాయ్.. నయన తార, చార్మి, వంటి తారలే కాదు పరిమితులు పాటిస్తారని పేరు తెచ్చుకున్న తమన్నా, ... తదితరులను కూడా వీలైనంత ఎబ్బెట్టుగా చూపించడానికి దర్శకులు సిద్ధమైపోతుంటారు.

గతంలో ఫ్యూడల్ తరహా విలువలను కొనసాగిస్తూనే ఇప్పటి మార్కెట్ కాలుష్యాన్ని కూడా తగిలించడం ప్రస్తుత లక్షణం. ఈ క్రమంలోనే నాయిక పాత్రల రూపు రేఖలు మారిపోయాయి. మొదట జయసుధ, సుహాసిని, తర్వాత సౌందర్య, ఇప్పుడు అనుష్క వంటి వారు కొన్ని బలమైన పాత్రల్లో కనిపించారనుకున్నా పరిమితమే. పైగా వారితోనూ రెండు రకాల అభినయాలూ వేయించేందుకు దర్శక నిర్మాతలు పడే ఆరాటం అంతా ఇంతా కాదు. కొన్ని విషయాల్లో సంప్రదాయ నాయిక పరిధి దాటి స్వేచ్ఛగా సంచరించే కొత్త తరం పాత్రలు సృష్టిస్తున్నట్టు అగుపించిన మన సినీ ప్రయోక్తలు అనతి కాలంలోనే ఆ ధోరణి మార్చుకుని వాణిజ్య మార్గం పట్టారు. కనుకనే సామాజిక సందేశం వున్న చిత్రాలు చాలా చాలా అరుదై పోతున్నాయి. చిత్రాల కథలే అలా వున్నప్పుడు వాటిలో అర్థవంతమైన స్త్రీ పాత్రలకు అవకాశం మరీ కుదించుకుపోతున్నది.

ఐటం తంతు...

ఈ పాత్రలే అధ్వాన్నంగా వున్నాయంటే అదనంగా ఐటం సాంగ్స్ తంతు ఒకటి. ఒకప్పటి క్లబ్ డాన్సర్ జయమాలిని ఈ మధ్య

ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తమకంటే ఇప్పటి హీరోయిన్లే కురచ దుస్తులు వేసుకుంటున్నారని అపహాస్యం చేశారు. క్లబ్‌డాన్సులకే ఐటం సాంగ్స్ అని కొత్త పేరు పెట్టి కెవ్వు కేకల చెత్త పాటలు పాడిస్తున్నారు. ఘనత వహించిన కథానాయకులు వారి పక్కన వెర్రి గంతులేస్తున్నారు. పైగా ఈ ఐటం సాంగ్స్ కోసం ఇన్ని కోట్లు ఇచ్చామని నిర్మాతలు ప్రచారం చేసుకుంటున్నారు. ఐటం సాంగ్స్‌లో అమ్మాయిల చుట్టూ గుంపులు గుంపులుగా అబ్బాయిలు చేరి తినేసేట్టు చూసే స్టెప్స్ సర్వసాధారణం. కాస్త గౌరవంగా నటిద్దామనుకుని వచ్చిన నటీమణులు ఇందుకు ఒప్పుకోకపోతే ఇంటిదారి తప్పదన్నట్టు పరిస్థితి తయారైంది. దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్నట్టు వారు కూడా ఎలాటి వస్త్రధారణకైనా సిద్ధమై పోతున్నారు. ఈ మధ్యన మరీ నగ్న దృశ్యాలు కూడా చర్చనీయమవుతున్నాయి. అమ్మాయిలే గాక అగ్ర కథానాయకులు కూడా దిగంబర స్వాములుగా దర్శనమిచ్చేస్తున్నారు. ప్రకృతిలో స్త్రీ పురుష సంబంధాలు సహజసిద్ధమైనవైనా కామదాహంతో తపించి పోతున్నట్టు చూపించడం అంతిమంగా స్త్రీల జీవితాలనే కాటేస్తున్నది. వాస్తవ జీవితం సంగతి అటుంచి తెరపైనే నాయకులు ఇరవైముప్పయ్యేళ్లు కొనసాగుతుంటే నాయికలు పదేళ్లు వుండటం అరుదైపోతున్నది. అది కూడా ఏ కొద్ది మంది మాత్రమే. తక్కిన వారిని రెండు మూడు సినిమాలతో ఇంటి దారి పట్టిస్తున్నారు. వారి అంగాంగ ప్రదర్శననే వ్యాపారంగా మార్చుకుంటూ కూడా వారు ఇన్నికోట్లు అడిగారు అన్నికోట్లు అడిగారని వ్యతిరేక ప్రచారం చేస్తున్నారు. ఇందాక చెప్పుకున్న సావిత్రి వంటి మహానటీమణులే ఆ రోజుల్లోనే ఈ సినీ మాయకు మాడిపోయిన తీరు మర్చిపోలేనిది. వారితో పోలిస్తే ఇప్పటి నాయికలు జాగ్రత్త పడుతున్నారని అంటున్నారు గాని అది ఆర్థికాంశాలకే. వాస్తవానికి వారి సామాజిక స్థానం పాత్రల పట్టు నానాటికీ దిగజారిపోతున్నాయి.

ఇదేగాక తమిళంలోనైతే నాయిక పాత్రలను మరింత దారుణంగా చూపిస్తుంటారు. వారు గనక దేవదాసును తీస్తే పార్వతి మోసగించినట్టు చూపిస్తారనుకోవాలి.ఎప్పుడూ పురుషుడు ప్రేమ బాధితుడు అమ్మాయిల చేతుల్లో బలైపోయే కాదల్ అన్నట్టు చిత్రిస్తారు. ఇందుకు భిన్నంగా తెలుగులోనైతే అమ్మాయిలను ఎంత ఏడిపిస్తే అంత మగాడు అన్న ట్టు తీస్తుంటారు. గతంలోనూ ఈ తరహా పాత్రలు లేవని కాదు. ఏడిపించే పాటలు, భార్యలను కొడితే దారికి వస్తారని చెప్పే చిత్రాలు గతంలోనూ వున్నాయి. పెద్ద హీరోలు కూడా వాటిలో వేశారు. కాని వాటి శాతం తక్కువ. రాజకీయ సామాజిక రంగాలతో పాటు చిత్ర రంగంలో విలువలు దిగజారుతున్న కొద్ది అత్యధికం స్త్రీ గౌరవాన్ని పాటించని విధంగా వుంటున్నాయి. ఇప్పుడు యాసిడ్ దాడులు చేసే ఏకపక్ష ప్రేమ పిశాచాలకూ ఈ పాత్రలకూ పెద్ద తేడా వుండదు. కాని కథ గనక ఏదో సన్నివేశంలో వారిని గొప్ప ప్రేమికులుగా మంచి మనుషులుగా చూపించి అమ్మాయిలే పశ్చాత్తాప పడేట్టు చేస్తుంటారు. పవన్ కళ్యాణ్ ఇంత పెద్ద హీరో కాకముందు తీసిన సుస్వాగతం చూడండి.. లేక అల్లు అర్జున్ 'ఆర్య', 'దేశ ముదురు', 'పరుగు' వంటి చిత్రాలు చూడండి.. ఏ చిత్రంలో నైనా సరే ఒక్కసారి కూడా కలవని మాట్లాడని నాయకుడు ప్రేమిస్తానని వెంటపడి వేధించడం స్పందించకపోతే నాయికది తప్పని నిందించడం ఎన్నిసినిమాల్లో చూస్తాం? అర్జున్‌ను హీరోగా ప్రతిష్టించిన ఆర్యలో ఒకమ్మాయి కోసం ఆమె ప్రమేయం లేకుండా మరొకరితో కలసి ప్రేమలో దింపే పోటీ పెట్టుకోవడం ఎలాటి కథ? అమ్మాయిలపై అత్యాచారాలు చేసేవాళ్లను అంతమొందించడమే ధ్యేయంగా పెట్టుకున్న 'రాఖీ' సినిమాలోనూ నాయకుడు ఇద్దరు నాయికలతో చేసే నృత్యాలు పరమ దుర్భరంగానే వుంటాయి. ఆ పాటల సాహిత్యం ద్వంద్వార్థ సంభాషణలు సరేసరి.

నిజమూ కల్పనా..

ఈ మధ్య నిర్భయ ఉదంతం తర్వాత దేశమంతా అమ్మాయిలపై అత్యాచారాల గురించి స్పందించింది. కొత్త చట్టం కూడా వచ్చింది. అయినా ఆ ఘటనలు ఆగింది లేదు. ఆంధ్రప్రదేశ్‌లోనూ తెలంగాణలోనూ కూడా ఉన్మాద హత్యలు, దాడులు, ఆత్మహత్యలు జరుగుతూనే వున్నాయి. ఈ ఘటనలకూ ఇప్పటి వరకూ చెప్పుకున్న వికృతచిత్రాలకూ సంబంధం లేదనుకోవడం పొరబాటు. అటు నుంచి ఇటైనా ఇటు నుంచి అటైనా అంతిమ ఫలితం ఒక్కటే. మహిళల ముఖ్యంగా అమ్మాయిల జీవితాలను వేధిస్తున్న అభద్రత. వారిని మనుషులుగా గాక వస్తువులుగా చూస్తే వెంటాడే దౌర్భాగ్యం. వస్తువును ఎవరైనా ఇష్టపడి కొనుక్కోవచ్చునన్నట్టే నచ్చిన అమ్మాయిని ఏం చేసైనా దారికి తెచ్చుకోవచ్చు లేదా దారుణంగా చంపేయవచ్చుననే ఘోర కృత్యాలు. తమ సంతోషం కోసం స్త్రీలను ఎలాగైనా హింసించవచ్చుననే రాక్షసత్వం. హీరోయిన్లను సినిమాల్లో అలా ఎవరు నటించమన్నారనే విమర్శ తరచూ వినిపిస్తుంటుంది. ఇష్టపూర్వకంగానో లేక కుటుంబ సభ్యుల వత్తిడి వల్లనో ధనాశతోనో చేస్తున్నారు గనక వారిది కొంత భాగం వుందని వాదించవచ్చు. అయితే సినిమా రంగంలో వారికి గౌరవ ప్రదమైన పాత్రలు ఇస్తే చేయబోమని ఏ నాయికా చెప్పదు. జయమాలిని నుంచి సిల్క్‌స్మిత, అనూరాధ, జయలలిత(క్యారెక్టర్ యాక్టర్) వరకూ అందరూ

స్త్రీ పాత్రల స్థానం

మన సినిమాల్లో మహిళల పాత్రలను ఉన్నతంగా చూపించడం చాలా తక్కువని ఐక్యరాజ్యసమితి అధ్యయనం తేల్చింది. వారు చోదక పాత్రల్లో వుండరు. సహాయక పాత్రలోనే కనిపిస్తారు. వారి ఆకర్షణగా కనిపించడం తప్ప బలమైన సంభాషణలు వుండవు. సైంటిస్టులు, ఇంజనీర్ల వంటి పాత్రల్లో చాలా తక్కువగానే చూపిస్తారు. అయితే వారిని కేవలం బొమ్మలుగా గాక పనిమంతులుగా వృత్తి చేసేవారిగా చూపించడం మాత్రం ఇండియాలోనే ఎక్కువగా జరుగుతుందట. ఉదాహరణకు ఫ్రాన్స్‌లో 44.4 శాతం మంది మహిళలు ఉద్యోగాలు చేస్తుంటే సినిమాల్లో అలాటి పాత్రలు 18.8 శాతమే వుంటున్నాయి. అదే ఇండియాలో 22 శాతం మంది మహిళలు ఉద్యోగాలు చేస్తుంటే సినిమాల్లోనూ 15.5 శాతం వరకూ అలాటి పాత్రల్లోనే చూపిస్తున్నారు. అయితే ఇక్కడ కూడా విడ్డూరం ఏమంటే మహిళలు సిఇవో వంటి అత్యున్నత బాధ్యతలు నిర్వహించడం చాలా తక్కువగా వుంటే సినిమాల్లో మాత్రం అతిశయోక్తిగా చాలా పాత్రలు అలాటివి చూపిస్తున్నారు. అలాగే పేదరికం శాతంతో పోలిస్తే ధనవంతుల పాత్రలు అత్యధికం. టీవీ సీరియళ్లలోనైతే ఇటు చాందస భావజాలాన్ని మరోవైపు కార్పొరేట్ యజమాన్యాలనూ స్త్రీలకే అంటగట్టి అవాస్తవ దృశ్యాలు ఆవిష్కరిస్తున్నారు. అందంగా లేని ఉన్నతులు గాని మహిళలు మనుషులే కారన్నట్టు వ్యవహరిస్తున్నారు.

సౌందర్య

మంచి పాత్రల కోసం ఆరాటపడ్డారు.

ఇక నిజ జీవితంలో అమ్మాయిల పరిస్థితి ఇంకా ఘోరం. ముల్లూ అరిటాకు సామెతకు అలవాటుపడిన ఈ దేశంలో రాక్షసత్యానికి బలైన అభాగ్యురాలే అందుకు బాధ్యురాలన్నట్టు మాట్లాడుతుంటారు. రాష్ట్ర కేంద్ర మంత్రులూ పోలీసు అధికారులూ ఆధ్యాత్మిక పీఠాధిపతులూ అరకొర పండితులూ అందరూ అమ్మాయిలు సభ్యతగా వస్త్రాలు ధరించాలని తొక్కలో సూక్తి చెబుతుంటారు. ఢిల్లీలో మరణించిన నిర్భయ గానీ లేక మొన్న మొన్న కోఠీ కళాశాలలో కత్తిపోట్లకు గురైన యువతి గాని తమ వస్త్రధారణ కారణంగా బలైపోయారా? ఎవరికి నచ్చిన వస్త్రాలు వారు ధరించేందుకు దేశంలో స్వాతంత్రం లేదా? పురాతన కాలంలో దేవదాసీలు జోగినీలు వుండటానికి కూడా ఆనాటి స్త్రీల వస్త్రధారణే కారణమా?

అప్పుడైనా ఇప్పుడైనా స్త్రీని ఆమె శరీరాన్ని పురుషాధిక్య కోణం నుంచి చూపించి చిత్రించి వికృత వాంఛలు తీర్చుకోవడం ఒక దుర్మార్గ నేరం. క్రికెట్ ఆటకు కూడా చీర్ గర్ల్సను నియోగించిన నీచ సంస్కృతిలో ఇంతకంటే మెరుగైన పరిస్థితి ఆశించలేము. వస్త్రధారణ స్వాతంత్ర్యం వేరు, కావాలని వస్తువులుగా మార్చి చూపించడం వేరు. అచ్చంగా రంగుల వ్యాపారమైన సినిమాలో ఇలాటి ధోరణులు మరింత విపరీతంగా మారడంలో ఆశ్చర్యం లేదు. స్త్రీలను గౌరవనీయులుగా శక్తిశాలులుగా ప్రతిభా వంతులుగా స్వతంత్ర వ్యక్తులుగా చూపించడం వారికి గిట్టదు(ఆర్థికంగానూ సామాజికంగానూ). అలాటి సమాజం నుంచి వచ్చినవారు ఆ సమాజాన్ని రంజింపచేయడం కోసం తీసే సినిమాల్లో చేసే కార్యక్రమాల్లో స్త్రీల చిత్రణ రోజు రోజుకు అధ్వాన్నమై పోతుంటుంది. వారి అందచండాలను గురించి చెప్పడం వేరు. ఆత్మగౌరవాన్ని కాపాడ్డం వేరు. రాం గోపాల్ వర్మ అందరూ ఈసడించిన 'సావిత్రి' చిత్రం పేరు తానెప్పుడూ కలవరించే 'శ్రీదేవి'గా మార్చడం చూస్తే ఈ పరిశ్రమ నైజం తెలుస్తుంది. అదే రియాల్టీ. ఎవరో అన్నట్టు 'మదర్ ఇండియా', 'మిస్ ఇండియా' గా మారిపోతున్నది. అమ్మ గొప్పదైనా మహిళలను కేవలం అలాగే చూపించాలని లేదు. మిస్ ఇండియా అనడంలో ఇప్పటి ప్రపంచీకరణ అందాల పోటీలను దెప్పిపొడవడం వున్నా ఆధునికత అవసరం లేదని కాదు. ఎటొచ్చీ మహిళల ఆత్మగౌరవాన్ని అస్తిత్వాన్నీ అస్మితను దెబ్బతీయడం అనుచితం అన్నది రీల్‌లోనైనా రియాల్టీలోనైనా గుర్తుంచుకోవలసిన పరమ సత్యం.

¤

'నగ్న' సత్యాలు

పాశ్చాత్య చిత్రాల్లో మహిళలను విచ్చలవిడిగా చూపిస్తారనీ, భారతీయ చిత్రాలు ఇప్పటికీ సంప్రదాయానికి కొంతైనా విలువనిస్తాయనీ అభిప్రాయముంది. అయితే వాస్తవంలో ఇది నిజం కాదని అధ్యయనాలు చెబుతున్నాయంటే ఆశ్చర్యం కలగొచ్చు. ఐక్యరాజ్యసమితి కోసం గీనా డేవిస్ ఇన్‌స్టిట్యూట్ 'మీడియాలో జెండర్ చిత్రణ' అనే అంశంపై పరిశోధన నిర్వహించింది. రాక్‌ఫెల్లర్ సంస్థ కూడా ఇందుకు సహకరించింది. వీరు తేల్చిందేమంటే భారతీయ చిత్రాల్లో మరీ ముఖ్యంగా బాలీవుడ్ చిత్రాల్లో 35 శాతం మహిళల పాత్రల్లో ఏదో ఒక మేరకు నగ్నత్వం చూపిస్తున్నారు. ఇది పశ్చిమ దేశాల్లో ఈ మోతాదులో వుండదు. పైగా ఇండియాలో సినిమాల్లో ఇలాంటి సన్నివేశాలు వచ్చినపుడు హాళ్లలో కేరింతలు, కేకలు మార్మోగుతుంటాయి. ఆ విధంగా భారత దేశంలో వోయరిజం (రహస్యంగా చూసి ఆనందించే అవలక్షణం) చాలా ఎక్కువని అనేక పరిశోధనలు చెబుతున్నాయి. హీరో గారు హీరోయిన్ను ఏడిపించడం లేదా అతిగా ప్రవర్తించడం చూసి వీరు ఆనందిస్తుంటారు. విలన్లు చేసే పనులను కూడా పురుష ప్రేక్షకులను దృష్టిలో వుంచుకుని అవసరానికి మించి చూపిస్తుంటారు. వీటికి 'ఎ' సర్టిఫికెట్ తెచ్చుకున్నా సినిమా హాళ్లలో ప్రవేశం దగ్గరకు వచ్చేసరికి ఏ తేడాలు పాటించరు. అసభ్య చిత్రాల హాళ్లలో కుర్రాళ్లే అధికంగా వుండటం అందరికీ అనుభవంలో వున్నదే. ఇదే గాక స్త్రీలను భోగ్య వస్తువులుగా చూపే మార్కెట్ సంస్కృతికి తోడు భోగినీ దండకాలు రాసిన ఫ్యూడల్ ధోరణులు తోడవుతుంటాయి. ఆఖరుకు పల్లెటూళ్లలో నాటకం ఆడేప్పుడు కూడా నాయికతో డ్యూయెట్ పాడుతూ పెద్ద ఘనకార్యం చేసినట్టు దండలు వేయించుకుంటారు, చప్పట్లు కొట్టించుకుంటారు. బావలు సయ్యా వంటి పాటలకు సినిమాలోనే గాక సినిమా హాల్లోనూ చప్పట్లు కేకలు మోగిపోతాయి. ఇప్పుడు రియాల్టీ షోలలో వాటిని పదే పదే చూపిస్తున్నారు.

అసలు భారతీయ సమాజంలో స్త్రీల పరిస్థితి పట్ల ఆలోచనా ధోరణిలో ఒక వైరుధ్యం విడ్డూరం వుందని ఐరాస అధ్యయనం తేలింది. ఇక్కడ స్త్రీల సమానత్వం గురించి ఉపన్యాసాలు దంచుతారు గాని సమానంగా ఒక్కనాటికీ భావించరు. అత్యాచారాలపై ఆగ్రహంగా ఖండిస్తారు గాని రేప్‌లపై జోకులు వేసుకుంటారు. ఈ మధ్య బాగా విజయవంతమైన మళయాల చిత్రం దృశ్యం. ఒకమ్మాయి స్నానం చేస్తుండగా రహస్యంగా సెల్‌ఫోన్‌లో చిత్రించిన జులాయి వేధించడం, ఆత్మరక్షణ కోసం అతన్ని చంపేసిన తల్లీ కూతుళ్లను భర్త కాపాడ్డం ఇతివృత్తం. ఈ చిత్రంలో హీరో కేబుల్ ఆపరేటర్. ఆఫీసులో సినిమాలు చూస్తూ ఉదయాన గాని ఇంటికి రాడు. అయితే చూసే సినిమాను బట్టి ఎప్పుడైనా వస్తుంటాడు. అలా ఒకరోజు ఇంటికి రాగానే భార్య మీనా తలుపు లోనే ఆపేసి ' ఈ రోజు ఏం సీన్ చూశారు? బాత్ రూం సీనా? రేప్ సీనా?' అంటుంది. దీనిపై విమర్శలు వచ్చిన రీత్యా తెలుగు రీమేక్‌లో కొద్దిగా మార్చారు. విలన్ పాత్రలు వేసే చలపతిరావు తాను వంద రేప్‌లు చేశానని తరచూ చెబుతుంటారు. రాజకీయ వేత్తలు (మొన్నటి మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంతో సహా) రేప్ అన్నది మామూలు మాటగా వాడేస్తుంటారు. విమర్శకులు అశ్లీలమని ధ్వజమెత్తిన 'గ్రాండ్ మస్తీ' వంటి చిత్రం 100కోట్లు వసూలు చేస్తుంది! 'చోళీ కే పీచే క్యాహై...' వంటి పాట రికార్డులు బద్దలు కొడుతుంది. 'కెవ్వు కేక' వంటి పాట, 'వదల బొమ్మాళీ' వంటి డైలాగు సాధారణంగా చలామణిలోకి వచ్చేస్తుంది.

'చోళీకే పీఛే...'లో మాధురీ దీక్షిత్

రక్త స్పర్శ

■ గోనుగుంట మురళీకృష్ణ

◆ కథ



> **"చిన్నవాళ్లు తప్పు చేస్తే సరిదిద్దాల్సిందిపోయి పెద్దవాళ్లే అనేక తప్పులు చేస్తున్నారు. అమ్మ, పెదనాన్న వాళ్ల గురించి లేనిపోనివన్నీ నాన్నతో చెబుతుంది. నాన్న పెదనాన్న వాళ్లని తిడతాడు. ఒకవేళ పెదనాన్నదే తప్పంటే మౌనంగా ఉంటే సరిపోతుందిగా! కొన్నాళ్లకి ఆయనే అర్థం చేసుకుంటాడు. వాళ్లని వీళ్లు, వీళ్లని వాళ్లు తిట్టుకుంటూ ఉంటే ఎన్నాళ్లు గడిచినా విద్వేషాలు రగులుకుంటూనే ఉంటాయి. అంతపెద్ద చదువులు చదివి, పెద్ద ఉద్యోగాలు చేసేవాళ్లకి ఇంత చిన్న విషయాలు ఎందుకు తెలియవో?"**

కొత్తగా కట్టి రంగులు వేసిన ఆ బిల్డింగ్ మీద నుంచీ విద్యుత్ తోరణాలు వేలాడుతున్నాయి. వీధికి కొంచెం దూరంగా ఉంది ఇల్లు. చుట్టూ ప్లాట్లుగా విభజించిన ఖాళీ స్థలాలు ఉన్నాయి. కొత్తగా కట్టిన ఇళ్లు కొన్ని, సగం కట్టిన ఇళ్లు కొన్ని అక్కడొకటి అక్కడొకటి విసిరేసినట్లుగా ఉన్నాయి. ఇంటి ముందున్న ఖాళీస్థలం నిండా షామియానా వేసి ఉంది. షామియానాకి ముందువైపున 'శృతి వెడ్స్ సునీల్' అనే ఫ్లెక్సీ బ్యానర్ వధూవరుల ఫొటోలతో సహా నిలబెట్టి ఉంది. సిమెంట్ రోడ్డు చివర నుంచీ ఇంటి వరకూ గల మట్టి రోడ్డుకి ఇరువైపులా ట్యూబ్‌లైట్లు కర్రలకు కట్టి వుండడంతో రాత్రి కూడా పట్టపగలులా అనిపిస్తూంది.

ఇంటిలోపల గదిలో స్టూల్ మీద కుర్చుని ఉంది శృతి. ఆడవాళ్లంతా ఆమెను అలంకరిస్తున్నారు. పట్టుచీరతో, బరువైన పూలజడతో నగలతో పగడాల చెట్టులా ఉంది శృతి. 'ఏమర్రా! ఇంకా అవలేదా? ముహూర్తం టైం అవుతుంది' హడావిడిగా లోపలికి వచ్చి అడిగింది సుగుణమ్మ.

'ఇదిగో! అయిపోవచ్చింది ఆంటీ!' పారాణి దిద్దుతున్న అమ్మాయి అన్నది.

'మమ్మీ!' చిన్నగా పిలిచింది శృతి. 'ఏమ్మా! ఏం కావాలి?' కూతురివైపు ప్రేమగా చూస్తూ అన్నది సుగుణమ్మ.

'బాబాయి, పిన్ని రాలేదు కదూ!' అన్నది శృతి. సుగుణమ్మ మొహం సీరియస్‌గా అయింది. 'వాళ్ల సంగతి నీకెందుకు?' తగ్గు స్వరంతో అన్నా, తీవ్రంగా అన్నది. ఇంకో మాటకి అవకాశం లేకుండా పని ఉన్నట్లు అవతలకి వెళ్లిపోయింది సుగుణమ్మ. శృతి నిట్టూరిచ్చింది. ఎన్ని మనస్పర్థలున్నా ఇలాంటి సమయంలో అందరినీ కలుపుకుపోవాలనుకుంటారు ఎవరైనా. మమ్మీ, డాడీ తమకిష్టం లేనివాళ్లని ఆమడదూరంలో ఉంచుతారు. ఇతరులని కూడా దూరంగా ఉండమని శాసిస్తారు.

తన మటుకు తనకైతే బాబాయి, పిన్ని మరీ అంత చెడ్డవాళ్లేం కాదు అనిపిస్తుంది. బాబాయ్ పిల్లలు సుధ, మధు తనని 'అక్కా' అని పిలుస్తూ ఎంతో అభిమానంగా ఉంటారు. తన తమ్ముడు రవి కూడా వాళ్లతో కలిసిపోతాడు.

మొన్న పెళ్లి చీరలు, నగలు కొన్నారు తనకి. 'పిన్నికి, సుధకి కూడా బట్టలు తీసుకుందాం మమ్మీ!' అన్నది తను. 'వాళ్లకి తీసుకోవటం ఏమిటి? ఇవన్నీ చూస్తే కుళ్లుకుంటారు. అసలు వాళ్లని పెళ్లికి కూడా పిలవటం లేదు' అన్నది.

'ఎందుకు మమ్మీ అలా అంటావు? పిన్ని ఎప్పుడైనా అలా ప్రవర్తించిందా?' అన్నది తను.

'నీకేం తెలియదు నోర్మయ్!' విసురుగా అన్నది మమ్మీ.

'పెళ్లి కుమార్తెను తీసుకు రండి' పురోహితుడి అరుపు లాంటి పిలుపు వినిపించింది ఈలోగా. దాంతో ఆలోచిస్తూ పరధ్యానంగా కుర్చున్న శృతి ఉలిక్కిపడింది. ఆడవాళ్లు కళ్యాణమంటపం దగ్గరికి తీసుకురావటానికి వచ్చారు. అందంగా పెయింట్ వేసిన కొబ్బరిబోండాం రెండు చేతులతో పట్టుకుని లేచి నిలబడింది శృతి.

పెళ్లి జరిగే ఇంటికి అయిదారిళ్ల అవతల, సిమెంటు రోడ్డుకి చివర గల రేకుల ఇంట్లో పడక్కుర్చీలో పడుకుని ఉన్నాడు చక్రవర్తి. కుర్చీ పక్కనే కింద కూర్చొని ఉంది కవిత. పెళ్లి సందడి, పురోహితుడి మంత్రాలు అన్నీ మైకులో నుంచీ పెద్దగా వినిపిస్తున్నాయి.

'మీ అన్నయ్య చూడండి. దూరపు చుట్టాల్ని, స్నేహితులని అందరినీ పెళ్లికి పిలిచాడు. స్వంత తమ్ముణ్ణి మిమ్మల్ని మాత్రం పిలవలేదు' అన్నది కవిత.

'నన్ను ఎన్నిసార్లో అవమానించాడు. తండ్రి ఆస్థి కొడుకులిద్దరికీ సమానంగా వస్తుంది కదా! నన్ను మోసం చేసి స్థలం మొత్తం తనే స్వాధీనం చేసుకున్నాడు. బిల్డింగ్ కట్టాడు. ఆ మాట అన్నందుకు నన్ను కొట్టడానికి వచ్చాడు' అన్నాడు చక్రవర్తి. ఆ సంఘటన గుర్తు రాగానే అతని మొహం కోపంతో ఎర్రబడింది.

'అంగ బలం, అర్థబలం, అధికార బలం ఉన్నాయి. మనకి అవేం లేవుగా! ఏం చేసినా చెల్లుతుంది అనుకుంటున్నాడు'

'అవును'

'మనల్ని ఉసురు పెట్టినందుకు వాడి కూతురు కాపరం గంగలో కలిసి పోవాలి' మెటికలు విరుస్తూ అక్కసుగా అన్నది కవిత.

'ఏంటి మమ్మీ ఆ మాటలు? శృతక్క చాలా మంచిది' అప్పటిదాకా

తల్లీదండ్రీ సంభాషణ వింటున్న సుధ అన్నది.

'ఓసి వెర్రి మొహమా! నువ్వు మంచిదానివి కాబట్టి నీ కళ్లకి అందరూ మంచివాళ్లలాగా కనిపిస్తారు. వాళ్ల కుళ్లు బుద్ధులు నీకేం తెలుసు?' అన్నది కవిత.

'సుధా! నువ్వు నోరు మూసుకుని లోపలికి వెళ్లు' అరిచాడు చక్రవర్తి.

సుధ లేచి లోపలిగదిలోకి వెళ్లి పడుకుంది. చిన్నవాళ్లు తప్పు చేస్తే సరిదిద్దాల్సిందిపోయి పెద్దవాళ్లే అనేక తప్పులు చేస్తున్నారు. అమ్మ, పెదనాన్న వాళ్ల గురించి లేనిపోనివన్నీ నాన్నతో చెబుతుంది. నాన్న పెదనాన్న వాళ్లని తిడతాడు. ఒకవేళ పెదనాన్నదే తప్పుంటే మౌనంగా ఉంటే సరిపోతుందిగా! కొన్నాళ్లకి ఆయనే అర్థం చేసుకుంటాడు. వాళ్లని వీళ్లు, వీళ్లని వాళ్లు తిట్టుకుంటూ ఉంటే ఎన్నాళ్లు గడిచినా విద్వేషాలు రగులుకుంటూనే ఉంటాయి. అంతపెద్ద చదువులు చదివి, పెద్ద ఉద్యోగాలు చేసేవాళ్లకి ఇంత చిన్న విషయాలు ఎందుకు తెలియవో?

మధు, రవి మాత్రం పెద్దవాళ్ల గొడవలతో తమకేం సంబంధం లేనట్లు కలసి ఆడుకుంటూ ఉంటారు. తను కాలేజీకి వెళ్లేటప్పుడో, వచ్చేటప్పుడో శృతి ఎదురవుతూ ఉంటుంది. తనతో ఎంతో అభిమానంగా ఉంటుంది. ఖాళీ దొరికినప్పుడల్లా ఇద్దరూ ఫోన్లో మాట్లాడుకుంటూ ఉంటారు. సుధ ఆలోచిస్తూ పడుకుంది. దూరంగా మైకులో పెళ్లి బాజాలు వినిపిస్తున్నాయి.

✡✡✡

శృతి పెళ్లి ముగిసింది. బంధువులంతా తిరిగి ఎవరి దారిన వాళ్లు వెళ్లారు. శృతి అత్తవారింటికి వెళ్లింది. గుమ్మాలకు కట్టిన మామిడాకుల తోరణాలు ఎండిపోయి, శుభకార్యం జరిగిన చిహ్నాలుగా మిగిలాయి.

ఆనందరావు, సుగుణమ్మ ఎదురెదురుగా సోఫాల్లో కూర్చుని ఉన్నారు. చాలాసేపటి నుంచీ పెళ్లి విశేషాలు చెప్పుకుంటూ ఉన్నారు.

'మీ తమ్ముడిని, మరదల్ని పెళ్లికి పిలవకుండా వాళ్లింటి ముందు నుంచే ఊరేగింపుగా వెళుతూంటే అప్పుడు చూడాలి వాళ్ల మొహాలు మాడిపోయాయి' భర్తతో సంబరంగా చెబుతుంది సుగుణమ్మ.

ఆనందరావు చిరునవ్వుతో వింటున్నాడు. 'లేకపోతే నాతోనే పంతానికి వస్తాడా? ఈ ఆనందరావు అంటే ఏమనుకున్నాడో?' గర్వంగా అన్నాడు. ఇప్పటికి అతని అహం శాంతించింది. సుగుణమ్మ ఏదో పనిమీద లేచి అవతలికి వెళ్లింది.

ఆనందరావు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా చేసి రిటైరయ్యాడు. ఆనందరావు తండ్రి ఎలిమెంటరీ స్కూల్ టీచర్. కొడుకుని కష్టపడి చదివించాడు. చక్రవర్తి ఆనందరావు కన్నా ఎనిమిదేళ్లు చిన్న. పెద్దకొడుకు పైకి వస్తే తనతో పాటు చిన్నకొడుకుని కూడా ఆసరా ఇచ్చి పైకి తీసుకువస్తాడని భావించాడు తండ్రి. తండ్రి ఏర్పరచిన మెట్లమీద గబగబా ఎక్కి పైకి చేరుకున్న ఆనందరావు కింద ఉన్నవాడిని మర్చిపోయాడు. తమ్ముడి అతీగతీ పట్టించుకోకుండా వదిలేశాడు.

కాలగతిలో తల్లీదండ్రీ మాయమయ్యారు. చక్రవర్తి స్కాలర్‌షిప్పులతో చదువుకుంటూ క్లర్క్ ఉద్యోగం తెచ్చుకుని పెళ్లి కూడా చేసుకున్నాడు. ఆనందరావు గెజిటెడ్ ఆఫీసర్ అయ్యాడు. గవర్నమెంట్ జీప్ ఇచ్చింది. తనకింద వాళ్లని, తక్కువ హోదా గలవాళ్లని చులకనగా చూడటం అలవాటైంది. తనకి ఎదురు తిరిగిన వాళ్లని కాలరాసి పారేసేవాడు.

ఆనందరావుకి దూరాలోచన ఎక్కువ. పల్లెటూర్లో తల్లిదండ్రులు నివసించిన ఇల్లు, పెద్ద ఖాళీ స్థలం

"చక్రవర్తి డాక్టర్లతో మాట్లాడి తనకి ట్రీట్‌మెంట్ ఇప్పించడం, కవిత రోజూ భోజనం తీసుకురావటం, తన భార్యకు తోడుగా ఉండటం, చిన్నవాడైన రవి ఆలనాపాలనా సుధ చూడడం ఇవన్నీ చూస్తున్న ఆనందరావు ఇంతక్రితం తను వాళ్లపట్ల చూపిన కాఠిన్యం, చేసిన అవమానాలు గుర్తొచ్చి, మనసు సిగ్గుతో కుంచించుకుపోయింది. ఈ రెండు రోజుల్లో అతనిలో ఉన్న గర్వం, అహంకారం పొరలుపొరలుగా విడిపోయింది."

ఉన్నాయి. అక్కడే ఇల్లు కట్టుకుంటే తనొక్కడే ఆక్రమించుకున్నాడనే చెడ్డపేరు వస్తుంది. అది అమ్మివేసి వేరోచోట కొనుక్కుని తన పేరు మీద పెట్టుకుంటే ఏ గొడవా ఉండదు. కానీ తమ్ముడు వాటాకి రాకుండా ఉండడు. అందుకని ముందు నుంచే వాళ్లని దూరంగా పెట్టడం ప్రారంభించాడు. వాళ్లతో రాకపోకలు కట్ చేశాడు. ఆ స్థలం అమ్మే సమయానికి అతను ఊహించినట్లుగానే చక్రవర్తి అడ్డుపడ్డాడు. అన్నదమ్ములిద్దరూ కొట్టుకునే దాకా వచ్చారు. కానీ ఆనందరావు అంగబలం, అర్థబలం ముందు చక్రవర్తి నిలవలేకపోయాడు. అది మోసం, ద్రోహం అంటే ఆనందరావు ఒప్పుకోడు. తన సామర్థ్యం, ఎదుటివాళ్ల తెలివితక్కువతనం అనుకుంటాడు. ఆ రోజు గొడవ జరిగిన తర్వాత అతని మనసు మండిపోతూంది. శృతి పెళ్లికి తమ్ముడిని తప్ప అందరినీ ఆహ్వానించాడు. ఇప్పటికి అతని అహం శాంతించింది.

✡✡✡

రెండు నెలలు గడిచాయి. ఒకరోజు అర్థరాత్రి వేళ బాత్‌రూంకి వెళ్లాల్సి వచ్చి చక్రవర్తికి మెలకువ వచ్చింది. లేచి గోడ గడియారం వంక చూశాడు. రెండయింది. తలుపు తెరుచుకుని వరండాలోని బాత్‌రూంలోకి వెళ్లి తిరిగివస్తూ యధాలాపంగా ఎదురింటి వైపు చూశాడు. ఆనందరావు ఇంటివెనక వైపు తలుపులు తెరచి ఉన్నాయి. బెడ్‌లైట్ కాంతి బయటకు కనపడుతూంది అతను ఆలోచనగా చూశాడు. ఆనందరావు ఇంటికి దగ్గర్లో ఇళ్లులేవు. ఖాళీ ప్లాట్లతో అక్కడొక ఇల్లు, అక్కడొక ఇల్లు ఎడంఎడంగా ఉన్నాయి.

'ఇంతసేపు ఏం చేస్తున్నారు బైట?' నిద్రమత్తుతో తల గోక్కుంటూ గడపలో నిలబడి అడిగింది కవిత.

'అటు చూడు. అన్నయ్య వాళ్లింటి పెరటివైపు తలుపు తీసి ఉంది. ఈ టైంలో ఇంతసేపు ఎందుకు తీసి ఉంచారు? నాకు ఏదో అనుమానంగా ఉంది' అన్నాడు.

'నిజమే! ఎవరో తిరుగుతున్నట్లు నీడలు కనిపిస్తున్నాయి' అన్నది. 'చూద్దాం పద' అన్నాడు చక్రవర్తి.

ఇద్దరూ బయటకు వచ్చారు. ఆనందరావు ఇల్లు కొత్తగా కట్టడం వల్ల ప్రహరీగోడ లేదు. చక్రవర్తి, కవిత మట్టిరోడ్డులో నుంచీ నడచి ఇంటి దగ్గరకు వచ్చారు. గోడవారగా నిలబడి చూశారు.

లోపల ఇద్దరు అగంతకులు పొట్టి నిక్కర్లతో, చింపిరి జుట్టుతో, బవిరి గడ్డాలతో ఉన్నారు. కళ్లు నిప్పుకణికల్లాగా ఎర్రగా ఉన్నాయి. ఒకడి చేతిలో కత్తి ఉన్నది. రెండవవాడు ఆనందరావు పెడ రెక్కలు విరిచి పట్టుకున్నాడు. డొక్కలో పొడిచినట్లు ఆనందరావు బనీను రక్తసిక్తమై ఉంది. కిందకు వాలిపోతున్నాడు.

సుగుణమ్మ మోకాళ్ల మీద కుర్చుని వాళ్ల వంక చూస్తూ దణ్ణాలు పెడుతూ ఏడుస్తూంది. 'బాబూ! కావాలంటే ఇంట్లో ఉన్న డబ్బు, నగలు తీసుకువెళ్లండి. మమ్మల్ని మాత్రం ప్రాణాలతో విడిచిపెట్టండి' అంటూంది. ఆ అగంతకుడు అటువైపు తిరిగి ఉన్నాడు. అతనివీపు కనపడుతూంది. చక్రవర్తి నిశ్శబ్దంగా రెండు అడుగులు ముందుకు వేశాడు. రవి ఆడుకునే క్రికెట్ బ్యాట్ తలుపు మూల గోడకు ఆనించి ఉంది.

'మిమ్మల్ని విడిచిపెడితే రేపు పోలీసులకు చెప్పకుండా ఉంటారా? మమ్మల్ని పట్టివ్వకుండా ఉంటారా? చూస్తావేరా ఏసెయ్యక' అన్నాడు ఇంకొకడు. వాడు కత్తిపైకెత్తాడు. ఇంకొక్క క్షణం ఉంటే ఆనందరావు గుండెల్లో పొడిచేవాడే! చక్రవర్తి క్రికెట్ బ్యాట్ అందుకుని 'ఫెడీ'మని వెనకనుంచీ కొట్టాడు. వాడి చేతిలోని కత్తి జారి పడింది. 'అబ్బా' అంటూ కేక పెట్టాడు.

వెంటనే రెండవవాడు కిందపడిన కత్తి అందుకుని చక్రవర్తి మీదకు దూకాడు. వాడు వదిలివేయగానే ఆనందరావు నేలమీద మూటలా పడిపోయాడు. చక్రవర్తి ప్రాణాలకు తెగించిన వాడిలా వాళ్లని ఎడాపెడా అందిన చోటల్లా కొడుతున్నాడు. వాడు చేతిలో కత్తితో పొడవటానికి మీదకు వచ్చాడు. కత్తి చక్రవర్తి చేతికి తగిలింది. చేతిలో బ్యాట్

కిందపడింది. ఇద్దరూ అతని మీద కలబడ్డారు.

కవిత డైనింగ్ టేబుల్ మీద ఉన్న స్టీలు కంచం తీసుకుని వాళ్ల మీద విసిరేసింది. అది ఒకటి మొహానికి తగిలి 'ఖణేల్' మంటూ కిందపడింది. 'దొంగ సచ్చినోళ్లలారా! చావండి' కవిత అరుస్తూ చేతికి అందిన గ్లాసులు, ప్లేట్లు విసరసాగింది. అవి వర్షంలా వాళ్లకి తగిలి కిందపడి 'ఖణేల్, ఖణేల్' మంటూ శబ్దాలు చేశాయి.

శబ్దాలకీ, అరుపులకీ చుట్టుపక్కల వాళ్లందరూ మేల్కొన్నారు. అందరి ఇళ్లల్లో లైట్లు వెలిగాయి. 'దొంగ! దొంగ!' అనే అరుపులూ, కేకలు మారుమ్రోగాయి. దొంగలిద్దరూ బైటకి పరుగెత్తారు. అందరూ అరుస్తూ వెంటపడి పట్టుకున్నారు. ఈ గలాటా విని అటుగా పెట్రోలింగ్‌కి వెళుతున్న పోలీస్ జీప్ ఇటు వచ్చింది. జనం అందరూ దొంగలకు దేహశుద్ధి చేసి పోలీసులకి అప్పగించారు.

✡✡✡

రెండు రోజుల తర్వాత–

ఆనందరావు హాస్పటల్లో బెడ్ మీద పడుకుని ఉన్నాడు. పొట్టచుట్టూ కట్టుకట్టి ఉంది. డాక్టర్ పరీక్ష చేస్తున్నాడు. కాంపౌండర్, నర్స్‌లతో పాటు చక్రవర్తి కూడా పక్కనే నిలబడి ఉన్నాడు. అతడి చేతికి ప్లాస్టర్ వేసి ఉంది. సుగుణమ్మ ఆనందరావు బెడ్‌కి తలవైపు నిలబడి ఉన్నది.

డాక్టర్ ప్రిస్కిప్షన్ మీద బరబరా ఏదో గీకి, 'ఈ ఇంజెక్షన్లు, మందులు వాడండి. భయం లేదు. త్వరలోనే తగ్గిపోతుంది. అన్నాడు చక్రవర్తి వంక చూస్తూ. చక్రవర్తి ప్రిస్కిప్షన్ అందుకున్నాడు. పక్కరూంలో పేషెంట్‌ను చూడటానికి డాక్టర్, ఆయన వెనకే కాంపౌండర్, నర్స్ వెళ్లిపోయారు.

ఇంతలో కవిత చేతిలో బరువైన బుట్టతో లోపలికి వచ్చింది. ఆమెతోపాటు సుధ, రవి కూడా వచ్చారు. 'అక్కా! బావగారికీ, నీకూ భోజనం తెచ్చాను' అన్నది.

'మా కోసం ఎందుకమ్మా అంత శ్రమపడతావు? అన్నది సుగుణమ్మ.

'ఇందులో శ్రమ ఏముంది? రోజూ మేం అన్నం వండుకోవడం లేదా! తినటం లేదా! కాకపోతే మీ కోసం ఇంకో గిద్దెడు బియ్యం ఎక్కువ పోస్తున్నాను. అంతే!' అన్నది.

అవన్నీ చూస్తున్న ఆనందరావు కళ్లు చెమర్చాయి. ఆరోజు తను స్పృహ తప్పిన తర్వాత చక్రవర్తి దొంగలను ఎదుర్కోవడం, తనని హాస్పటల్లో చేర్చుకోవడం అంతా సుగుణమ్మ చెప్పింది. చక్రవర్తి డాక్టర్లతో మాట్లాడి తనకి ట్రీట్‌మెంట్ ఇప్పించడం, కవిత రోజూ భోజనం తీసుకురావటం, తన భార్యకు తోడుగా ఉండటం, చిన్నవాడైన రవి ఆలనాపాలనా సుధ చూడడం ఇవన్నీ చూస్తున్న ఆనందరావు ఇంతక్రితం తను వాళ్లపట్ల చూపిన కాఠిన్యం, చేసిన అవమానాలు గుర్తొచ్చి, మనసు సిగ్గుతో కుంచించుకుపోయింది. ఈ రెండు రోజుల్లో అతనిలో ఉన్న గర్వం, అహంకారం పొరలుపొరలుగా విడిపోయింది. తమ్ముడి పట్ల ఏ మూలో దాగి ఉన్న అనురాగం పెల్లుబికింది. సుగుణమ్మ కూడా గతంలో తను తోడికోడలి పట్ల ప్రవర్తించిన తీరుకు సిగ్గుపడింది.

చక్రవర్తి అన్నగారి బెడ్ అంచున కూర్చుని 'ఎలా ఉంది అన్నయ్యా! నొప్పి ఎక్కువగా ఉందా?' అన్నాడు. ఆనందరావు తమ్ముడి చెయ్యి ఆప్యాయంగా నిమిరాడు.

'చక్రీ! నీకు నేను చాలా అన్యాయం చేశానురా! ఇద్దరికీ చెందవలసిన ఆస్తి నేనొక్కడినే స్వాధీనం చేసుకున్నాను. నిన్ను ఎన్నోసార్లు అవమానించాను. ఆఖరికి శృతి పెళ్లికి ఈ వీధిలో వాళ్లందరినీ పిలిచాను కానీ స్వంత తమ్ముడివైన నిన్ను పిలిచి ఇంత అన్నం పెట్టటానికి కూడా మనస్కరించలేదు. నేను చేసిన తప్పులకి ఇప్పుడు అనుభవిస్తున్నాను'.

'ఛ!ఛ! అంతమాట అనకు అన్నయ్యా! జరిగిందేదో జరిగిపోయింది. అవన్నీ మనసులో పెట్టుకుని ఆరోగ్యం పాడుచేసుకోకు. అయినా నేను కూడా నీకు ఎదురు తిరగవలసింది కాదు'

'ఇక నుంచీ, సుధ, మధులు నీ బిడ్డలు కాదు. నా బిడ్డలు వాళ్ల చదువు సంధ్యలు, పెళ్లిళ్లు అన్నీ నేను చూసుకుంటాను'

'అదేంటన్నయ్యా! నేను సంపాదించేవి పిల్లల కోసం కాదూ! దాచుకొని ఏం చేసుకోను?' అన్నాడు చక్రవర్తి.

'నువ్వు పోషించలేవని కాదయ్యా! ఇప్పటివరకు పిల్లలకి మా చేత్తో ఏమీ కొనివ్వలేదు. మమ్మల్ని కూడా కొన్నాళ్లు ఆ ముచ్చట తీర్చుకోనీ!' అన్నది సుగుణమ్మ.

'పెదనాన్నా! మీ అన్నదమ్ములిద్దరూ ఆస్తుల కోసం కొట్టుకున్నారు. ఒకరిని చూసి ఒకరు కత్తులు దూసుకున్నారు. కానీ ఆత్మీయులు ఆపదలో ఉన్నప్పుడు ఇవేమీ గుర్తుకురావు. పరుగెత్తుకుని వెళ్లి ఆదుకోవాలనిపిస్తుంది. ఆ రక్తస్పర్శే అలా లాక్కువెళుతుంది. మీరిద్దరూ కలుసుకున్నారని తెలిస్తే శృతక్క ఎంత సంతోషిస్తుందో?' అన్నది సుధ.

'బాగా చెప్పావు తల్లీ! మా పెద్దవాళ్ల గొడవలు పట్టించుకోకుండా మీరు పిల్లలు నలుగురూ కలిసిమెలసి ఉన్నారు. ఎప్పటికీ అలాగే అన్యోన్యంగా ఉండండి' అన్నాడు ఆనందరావు.

స్వార్థాన్ని త్యజించిన మనసు ప్రక్షాళన పొందినట్లుగా ఆయన కళ్ల నుంచీ ఆనందభాష్పాలు రాలాయి.

▪ ఫోన్: 9701260448

◆ కార్టూన్ కదంబం









గుండెల్లో మంటలు రేపే కథలు

ఉద్వేగం..భావోద్వేగం ఈ రెండూ మనిషిని అనునిత్యం వెంటాడుతుంటాయి. వీటి నుండి తప్పించుకునేందుకు ప్రయత్నించిన ప్రతి మనిషీ ఓడిపోయాడే తప్ప గెలిచిన దాఖలాల్లేవు. భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య విభజన రేఖల మూలంగా ప్రతిక్షణంలోను, అన్ని సందర్భాల్లోనూ భావోద్వేగంతోపాటు మానసిక సంఘర్షణకు గురైన సాదత్ హసన్ రాసిన మంటో కథలు మన గుండెల్లో మంటలు రేపుతాయి. భారత చిత్ర పరిశ్రమకు రాజధాని అయిన ముంబయి సినీ వినీలాకాశంలో తారాజువ్వలా వెలుగుతున్న హసన్ దేశ విభజన మూలంగా పాకిస్తాన్‌లోని లాహోర్‌కు వెళ్ళిపోవాల్సి వచ్చింది. ఆ సందర్భంగా 'మనిషిని మనిషిగా చూసేదే మతం..అదే నిజమైన మానవత్వం' అనే నగ్నసత్యాన్ని మరిచిన కొంతమంది వ్యక్తులు, మరికొన్ని శక్తులు వ్యవహరించిన తీరు తెన్నులను ఆయన తన చిట్టిపొట్టి కథల ద్వారా ఎంతో హృద్యంగా, మరెంతో వ్యగ్యంగా ప్రపంచం ముందుంచారు. స్వార్థపర, అసాంఘిక శక్తుల వల్ల తలెత్తిన ఉద్రిక్త పరిస్థితులు, హింసాకాండ మూలంగా బలైన అమాయకుల దీనస్థితిని వివరించాడు. ఇదే సమయంలో మతం, ప్రాంతం, ధనప్రీతి, అహంభావం లాంటి దుర్గుణాలు తలకెక్కిన 'అమానుష్యులు' ఇతరుల పట్ల అనుసరించిన వ్యవహారశైలిని ఎండగట్టాడు. తమతోటి మనుషులను ఇబ్బందిపెట్టటం, సాధించటం ద్వారా వారు పొందిన పైశాచికానందాన్ని చూసి రచయిత తన కథల్లో ఎగతాళిగా నవ్వుకున్నాడు. అప్పుడే పాఠశాల నుండి వచ్చిన ఓ చిన్న పిల్లవాడు, అతని తండ్రి మధ్య జరిగిన సంభాషణ ద్వారా యుద్ధోన్మాద ఘంటికల ప్రభావం సామాన్యుడి హృదయంపై ఎంతటి గాయం చేసిందో వివరించాడు. దేశ విభజన సమయంలో ఆస్తులు, అప్పులను పంచుకున్నట్లు పిచ్చివాళ్లను కూడా పంపిణీ చేసుకోవాలన్న ఇరు దేశాల నిర్ణయంతో ఆ మానసిక రోగులు పడ్డ ఇబ్బందులను మానవీయ కోణంలో చూపించాడు. మనసుకన్నా మతమే గొప్ప అని భీష్మించుకు కూర్చున్న ఇద్దరు ప్రేమికులు చివరికి 'ఎవరికి వారే యమునా తీరే' అనే విధంగా విడిపోయిన తీరును చెప్పటంలో నేర్పరితనాన్ని ప్రదర్శించాడు. అల్లకల్లోల పరిస్థితుల్లో చేతికందినంత సొమ్మును దోచుకురావాల్సిన తన ప్రియుడు పరాయి స్త్రీ వ్యామోహంలో పడి ధనాన్ని వదిలేశాడని తెలుసుకుని అపరకాళిలా విజృంభించిన ప్రేయసి, క్షణికావేశంలో అతణ్ని మట్టుబెట్టిన వైనాన్ని ఎంతో భయానకంగా వర్ణించాడు. దేశం రెండుగా విడిపోయిన సమయంలో తప్పిపోయిన తన చిన్నారి కూతురు కోసం ఒక కన్నతల్లి పడే వేదన, ఏళ్లు గడిచినా కుమార్తె ఆచూకీ దొరక్కపోవటంతో ఆమె అనుభవించే రోదన...వెరసి ఆవేదనతో పాఠకుల హృదయాలను బరువెక్కించాడు. చివరకు ఆ మాతృమూర్తి చిక్కి శల్యమై చావుబతుకుల మధ్య కొట్టాడుతున్నప్పటికీ ఆ కసాయి కూతురు పట్టించుకోని వైనాన్ని చెప్పే క్రమంలో నేటితరం యువతీ యువకులకు పరోక్షంగా హితబోధ చేశాడు. ఈ విధంగా చెప్పుకుంటూపోతే మంటో రాసిన ఒక్కో కథ ఒక్కో బుల్లెట్‌లా మన హృదయంలోకి దూసుకుపోతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ పుస్తకానికి రాసిన ముందుమాటలో పేర్కొన్నట్లు...కొంతమంది వ్యక్తుల కుత్సిత ధోరణుల వల్ల ప్రేమ, స్నేహం, ఔదార్యం వంటి పవిత్రమైన భావాలు ఎంతటి ప్రమాదంలో పడ్డాయనే విషయాన్ని హసన్ తన కథల్లో అత్యంత అద్భుతంగా చిత్రీకరించారు. సాటి మనిషిని మనిషిగా భావించే ప్రతి ఒక్కరూ చదవాల్సిన ఇంతటి మంచి పుస్తకానికి పదునైన పదాలను ఏర్చి కూర్చి తెలుగులోకి అందించిన అనువాదకులు అభినందనీయులు.



మంటో కథలు
రచన: సాదత్ హసన్ మంటో
అనువాదం : దేవి,ధర : రూ. 60/-
పేజీలు : 103
ప్రతులకు : వనమాలి, 1-11-59/ఎ/3, చిన్న తోకట, న్యూ బోయిన్‌పల్లి, సికింద్రాబాద్ -11.
సెల్ : 9010646492.

-బి.వి.యన్.పద్మరాజు

పర్యావరణ పరిరక్షణ పాంచజన్యం

సంపాదకులు : డా॥ జనపాల శంకరయ్య.
పేజీలు : 54, ధర: రూ. 50/–
ప్రతుల కోసం : డా॥ జనపాల శంకరయ్య, ప్రధాన కార్యదర్శి, సి.సా.స– సిరిసిల్ల, ఇ.నె 1–12/2, జ్యోతినగర్, చంద్రంపేట, మం॥సిరిసిల్ల, జి॥ కరీంనగర్. సెల్ : 9652647260, 94932 64120.

శ్రీకృష్ణదేవరాయ జయంత్యుత్సవ ఉపన్యాసాలు - వ్యాసాలు

సంపాదకత్వం : డా॥ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, ధర: రూ. 150/–, పేజీలు : 160, ప్రతులకు : వేమన అధ్యయన అభివృద్ధి కేంద్రం, తాళ్ళకాల్వ గ్రామం, గాండ్లపెంట మండలం, అనంతపురంజిల్లా – 515521. సెల్ : 9963917187, 441317766.



కల్లూరు సుబ్బారావు జీవితగాథ

రచన : శ్రీమతి నీలంరాజు భార్గవి, ధర : రూ. 40/–, పేజీలు : 72, ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్నీ బ్రాంచీలలో.



దారేది?



చింటూకి ఆ టేబుల్ దగ్గరకు చేరుకోవాలంటే దారి కనపడడం లేదట.. అయితే ఆ దారేదో మీరు కనిపెట్టగలరా!

రంగులేద్దాం!

గుడ్లగూబకు రంగులేస్తే మరింత అందంగా ఉంటుంది. మరి ఇంకెందుకు ఆలస్యం! స్కెచ్‌పెన్నులు, రంగు పెన్సిళ్లు తీసుకోండి.

తేడా బొమ్మ ఏదోచ్



పిల్లలూ పై బొమ్మలో ఒక్కో వరుసలో ఒకబొమ్మ తేడాగా ఉంది. దాన్ని మీరే కనిపెట్టాలి మరి!

జవాబు: 1-4, 2-1, 3-2, 4-4

పూరిద్దాం!



చిన్నారులు మీకు ఇంగ్లీషు బాగా వచ్చుకదా! అయితే ఈ బొమ్మల ఆధారంగా గళ్లలో వాటి పేర్లను ఇంగ్లీషు అక్షరాలతో నింపేసేయండి.

1) crocodile, 2) rabbit, 3)icecream, 4)apple

ఆ ఏడు ఏవబ్బా...





ఈ రెండు బొమ్మలు చూడ్డానికి ఒకేలా వున్నా ఏడు తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టి సున్నా చుట్టేసేయండి.

జత చేద్దాం!



పిల్లలూ! ఇక్కడ బొమ్మలకెదురుగా వాటి నీడలూ వున్నాయి. దేని నీడ ఏదో కనుక్కొని జతచేయండి.

కనిపెడదామా!





పై బొమ్మలో కింద ఇచ్చిన ఎనిమిది వస్తువులు దాక్కున్నాయ్...! మీరు వాటిని గుర్తించగలరా! బొమ్మను బాగా పరిశీలిస్తే వెంటనే కనిపెట్టొచ్చు.

ఎన్ని క్యారెట్లు?

ఇందులో కొన్ని క్యారెట్లు దాక్కున్నాయి. వాటిని గుర్తించి, లెక్కించి మా జవాబుతో సరిచూసుకోండి.

◆ ప్రత్యేకం

ఎంతైనా... సై..

డజను పింగాణీ కప్పులు కొనాలన్నా... చిన్న ఇల్లు కొన్నాలన్నా... మోపెడ్ కొనాలన్నా... పెళ్లి చేసుకోవాలన్నా... ఖర్చు గురించి ఆలోచిస్తాం. కానీ ఈ కోటీశ్వరులు సరదాగా ... కొనేసిన వస్తువులేంటో చూడండి.

అబ్బో... అంత రేటా!

ఆ మధ్య ఓ చైనా కోటీశ్వరుడు వార్తలకెక్కాడు. ఎలాగో తెల్సా? ఒక పింగాణి గిన్నె కొని. అబ్బో మనం కూడా కొంటుంటాం. అంతమాత్రానికే పత్రికలకెక్కుతారా ఏంటి అనుకోకండి. ఆయనగారు కొన్న గిన్నె ఖరీదు 36 మిలియన్ డాలర్లు. ఎందుకింత గిరాకీ? అంటే ... ఇది మింగ్ వంశానికి చెందిన ... 500 ఏళ్ల నాటి గిన్నె కాబట్టి. ఇలాంటి గిన్నెలు ప్రపంచంలో పదిహేడు మాత్రమే వున్నాయట. అందుకే అంత ధర. ఈ మధ్య ఆయనగారు ఈ గిన్నెలో సూప్ తాగడం పెద్ద వార్తే అయింది. మరి అంత ఖరీదైన కప్పులో పోసేసరికి ...సూపుకు కూడా దాని విలువ వచ్చేసింది.

ఎగిరే ఇంద్రభవనం

మామూలుగా విమానంలో 800 మంది వరకు ప్రయాణించవచ్చు. కానీ బాగా డబ్బుండి... ఖర్చు ఎలా చేయాలో తోచుబాటుకాని వారుంటారే... వారేం చేస్తారంటే... ఇలాంటి విమానాలను కొనేస్తుంటారు. సోలోగా ప్రయాణించడానికే. అల్వాలీద్ బిన్ తలాల్ బిన్ అబ్దుల్ అజీజ్ అల్-సౌద్ ఆ కోవకు చెందినవాడే. ఈయన గారెవరంటారేమో! సౌదీ యువరాజు లెండి. ఇంతకీ ఈ ఎయిర్ బస్సును ఎంతకు కొన్నారనుకుంటున్నారు? ఆ... ఎంతా! సింపుల్‌గా 400 మిలియన్ డాలర్లకే. దీనికే ఇంతగా ఆశ్చర్యపోకండి. మరో వంద మిలియన్ డాలర్లు పోసి ఆ విమానాన్ని తనకు నచ్చిన పద్ధతుల్లో మార్చుకున్నాడు. ప్రస్తుతానికి ఈ విమానంలో మూడు అంతస్తులు, ఒక లిఫ్టు, ఓ గ్యారేజి, ఆవిరి గది, ఇతరత్రా వ్యక్తిగత గదులు... వున్నాయి. ఇది ఎగిరే ఇంద్రభవనం అనుకోండి!

వివాహ వైభోగమే...

మీరు బోలెడంత మంది పెళ్లిళ్లను చూసి వుంటారు. కానీ ఇదిగో టెక్ గురు సియాన్ పార్కర్ పెళ్లిని పోలిన పెళ్లిని... ఇంతవరకు చూసి వుండడం కాదు కదా విని కూడా వుండరు. ఈయనగారు తమ వివాహం కోసం ఏకంగా ఒక అడవినే అద్దెకు తీసుకున్నాడు. అయితే అందుకు కేవలం 366 మంది అతిథులను మాత్రమే ఆహ్వానించాడు. వారికి ప్రత్యేకమైన దుస్తులు కూడా అందించాడు. ఇహ.. అద్భుతంగా అలంకరించిన వివాహ వేదిక, ఏరులై పారిన మందు, విందు చెప్పేదేముంది? మొత్తంమీద ఇందుకు అయిన ఖర్చు 10 మిలియన్ డాలర్లు. అంతే.

చూడానందమే

ఈ మందు బుడ్డి (ఈగిల్ కేబర్నెట్ సావిగాన్ 1192) ఖరీదు ఎంతనుకుంటున్నారు? కేవలం 500,000 డాలర్లు. ఇన్ని డాలర్లు పోసి కొన్న ఈ మందు బుడ్డిని ఎదురుగా వుంచుకుని తాగకుండా తాకకుండా వుంటారా ఎవరైనా. చేజ్ బెయిలీ అనే పెద్దమనిషి అదే చేస్తున్నాడు. 2000 సంవత్సరంలో... వేలంపాటలో కొన్నప్పటి నుంచి ఇప్పటి వరకు మూతే తియ్యలేదంటే నమ్మండి. జస్ట్ చూడానందం. అంతే.



ఏకంగా ద్వీపమే కొనేస్తే...

మామూలుగా మనం స్కూటీలు, బైక్‌లు కొంటుంటాం. మహా అయితే జీవితకాలంలో ఓ చిన్న కుటీరాన్ని కొనుక్కుంటాం. కానీ బడా బాబులు ఏకంగా ఓడలను, వందల అంతస్తుల విల్లాలను, విమానాలను కొనేస్తుంటారు. ఒరాకిల్ స్థాపకుడు లారీ ఎల్లిసన్ అదే చేశాడు. ఈయన గారు 500 మిలియన్ డాలర్లు పోసి ఒక దీవిని కొనుగోలు చేశాడు. ఎందుకంటే ... అదో సరదా! అంతే!!

అదిరేటి డ్రెస్సు నేనేస్తే...

'శునక భోగం'లా కనిపించినా... ఇదంతా 'క్షణిక భోగ'మే. ఈ కోట్లు, టైలు, కళ్లజోళ్లు, టోపీలు, చలిబన్నీలు, గొలుసులు... అన్నీ ఆ కాసేపే. ఫొటోలు, వీడియోలు తీయడం అయిపోగానే తీసేస్తారు. మరి మోడళ్లకు అంతేకదా. ఇప్పడు అర్థమైందనుకుంటా విషయం. య్యస్! ఇది మామూలు కుక్క కాదు. మోడల్ డాగ్. న్యూయార్క్‌లోని ఓ వెబ్‌సైట్‌కు మోడలింగ్ చేస్తుంది. అదీ... మార్కెట్‌లో మంచి పేరున్న బ్రాండ్లకు. ఇదంతా ఎలా, ఎప్పడు ప్రారంభమైంది?! అంటే ఉబుసుపోక తమాషా కోసం చేసిన పని... ఇలా ఉత్సుకతతో ప్రపంచం అంతా చదువుకునేలా చేసింది. ప్రపంచంలోని శునకాలన్నీ పిచ్చుకలను తరుముతూ, బంతులను పట్టుకుంటూ ఆడుకుంటుంటే...దీనికా తీరికే లేదు. మోడలింగ్‌లో ఫుల్లు బిజీ అయిపోయింది.

క్షణం కూడా తీరిక లేని ఈ కుక్క పేరు 'బోధి'. యెనా కిమ్, డేవ్ ఫుంగ్ దీని యజమానులు. వీరిద్దరూ మోడలింగ్ రంగంలో వున్నారు. ఓసారి ఆఫీసులో ఉబుసుపోక... తాము తయారుచేసిన బట్టలను బోధికి తొడిగారు. ఆ క్షణాన... బోధి కళ్లల్లో ... ఓ మెరుపు కనిపించిందట. బహుశా అవన్నీ దానికి కూడా నచ్చాయేమోనని... ఫొటోలు తీసి... ఫేస్‌బుక్‌లో వుంచారు. ఇక చూస్కోండి! ఊహించని స్పందన వచ్చింది వాటికి. 24 గంటలు తిరిగే సరికి బోధి ఫొటో ఓ పత్రిక వెబ్‌సైట్‌లో దర్శనమిచ్చింది. బాగా ఆలోచించిన మీదట వీరిద్దరూ ఓ నిర్ణయానికొచ్చారు. బోధితో మోడలింగ్ చేయిస్తే ఎలా వుంటుందీ? అని. అంతే... మగవాళ్ల వస్త్రాలకు మోడలింగ్ చేయించడం మొదలెట్టారు. అంతటితో ఊరుకోక ఇన్‌స్టాగ్రమ్‌లో ఫొటోలు పెట్టసాగారు. వేలల్లో ఫాలోయర్లు ఏర్పడ్డారు. సొంతగా వెబ్‌సైట్ ప్రారంభించేశారు. ప్రస్తుతం వారిద్దరూ తమ ఉద్యోగాలకు విడిచిపెట్టేసి... బోధితో మోడలింగ్ చేయించడం మీదే శద్ధ పెట్టాలని చూస్తున్నారు.

¤

తొమ్మిది నెలలు... నలుగురు పిల్లలు...

సారా- బెన్ చూడ చక్కటి జంట. ఏడాది క్రితం ఇద్దరూ ఇంట్లో వుంటే నవ్వుల సెలయేరు జోరుగా పారేది. అలాంటిది ఇవాళ ఇద్దరూ ఒకే గదిలో వున్నా... ప్రేమగా పలకరించుకోవడానికి, మనసారా కాసిని కబుర్లు చెప్పకోవడానికి కూడా కుదరట్లా. మరి వారి మధ్యకు నల్గురు చిన్నారులు వచ్చేశారు. ఇంక ఎలా కుదురుతుంది చెప్పండి. ఈ నల్గురు పిల్లల పుట్టుక లండన్‌లోనే కాదు. ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తించింది. సారా-బెన్ తొలి సంతానం ఫ్రెడ్డీ. ఈ పిడుగు పుట్టిన కొద్ది వారాలకే సారా మరలా గర్భం దాల్చింది. వెంట వెంటనే బిడ్డలు కలగడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదురౌతాయని తెలిసినా...అబార్షన్ ఆలోచన చేయలేదు. అయితే తమకు ఒకేసారి ముగ్గురు చిన్నారులు పుట్టబోతున్నారని తెలుసుకుని అవాక్కయ్యారు సారా, బెన్. ఫ్రెడ్డీతో ఎక్కువ సమయం గడపలేమేమోనని బెంగ మొదలైంది ఇద్దరిలో. అందుకే వాడితో సాధ్యమైనంత ఎక్కువగా ఆడుకునేవారు. సారా ఏడవ నెలలోనే ప్రసవించడంతో... ముగ్గురు చిన్నారులను ఆసుపత్రిలోనే వుంచారు. ఇక వారు ఇంటికి వచ్చాక మొదలైంది వారి కష్టకాలం. బెన్‌కు బయట ఉద్యోగం కాక... ఇంట్లో పిల్లల ఉద్యోగం. ఇక సారాకైతే 24 గంటలూ పనే. సాయంత్రం అయ్యే సరికి కాఫీ కప్పు కూడా పట్టుకోలేనంత నిస్సత్తువ ఆవరిస్తుంది వారిలో. వారం మొత్తంలో నలుగురి మీద 175 నేపీలు మార్చాలి. 80 సీసాల పాలు పట్టాలి. ఇక వాళ్ల బట్టలు ఉతకడం, సీసాలు ఉడకబెట్టడం, కడగడం, పాలు నింపడం, పట్టడం, నిద్ర పుచ్చడం...ఇదే... పని సారాకు పూర్తిగా. అయితే అన్నిటినీ ప్రేమతో పంచుకుంటూ చేసుకుపోతున్నారు సారా బెన్. సారా సోదరి మాత్రం వీరిని చూసి చెళుకులు విసురుతుంటుంది. 'మాకు నలుగురు పిల్లలు కలగడానికి నేను నాలుగు సార్లు ప్రసవ యాతన పడ్డాను. కానీ ... సారా రెండు సార్లతోనే సరిపుచ్చేసింది' అని. ఇదండీ సారా-బెన్-నలుగురు బుడతల కథ. ¤